ఈనాడు
కరీంనగర్
సోమవారం 21 ఆగస్టు 2017 | 16 పేజీలు

సర్కారు బడుల బలోపేతమే లక్ష్యం




ఎస్సెస్సీ పరీక్షల్లో 10, 9.8 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాపరంగా ఎన్ని డబ్బులైనా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీ వినోద్ పాల్గొన్నారు.

3లో..

వర్ష 'పాత లెక్కలు'.. అన్నదాతకు చిక్కులు!







- కొత్త మండలాల్లో పరికరాలు ఊసేదీ?
- తహసీల్దార్, ఉపకేంద్రాల నమోదులో వ్యత్యాసాలు
- పట్టించుకోని అధికారులు..
- నష్టపోతున్న రైతులు

జిల్లా సగటున కురవాల్సిన వర్షం : 519.3 మిమీలు

కురిసిన వర్షం : 443 మిమీలు

లోటు 76.3 మిమీలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్

చినుకు ఆగదు.. చెరువు నిండదన్నట్లుగా తయారైంది రైతన్న పరిస్థితి.. అతివృష్టి, అనావృష్టి ఏదైనా వర్షపాత గణాంకాలే కీలకం. వర్షాలు ముంచెత్తి పంటకు నష్టం జరిగినా.. వర్షాభావంతో పంటలు ఎండినా వర్షపాత నమోదు కేంద్రాలదే ప్రధాన పాత్ర.. నష్టపరిహారమైనా, కరవు పరిహారమైనా ఇదే విధానం.. ఈ క్రమంలో ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు పలకరించినా కాలక్రమేణా వర్షాభావ పరిస్థితులు సాగు రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయి. రైతన్నకు పరిహారం రావాలంటే.. వర్షపాత వివరాలు తప్పనిసరి. జిల్లాల విభజన క్రమంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో కొత్త మండలాలు ఏర్పడగా సదరు కేంద్రాల్లో పరికరాలు ఏర్పాటు చేయకపోగా పాత మండలాలు, వాతావరణ కేంద్రాల పరికరాలపై కన్నెత్తి చూడకపోవడం దారుణ పరిణామం..

జిల్లాల విభజన క్రమంలో కొత్త మండలాలు ఏర్పడిన సంగతి తెలిసిందే.. జిల్లాలో ఇల్లందకుంట, గన్నేరువరం, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాలు ఏర్పడగా ఎక్కడా వర్షపాత పరికరాలు లేవు. కొత్త మండలాల క్రమంలో యుద్ధప్రాతిపదికన వాటిని ఏర్పాటు చేయాల్సి ఉండగా నేటికీ ఆ ఊసేలేదు. వర్షపాత నమోదు రైతన్నకు కీలకం.. కరవు ప్రాంతంగా గుర్తించాలంటే వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకుని పంట కోత(దిగుబడి), పంట విస్తీర్ణం, నష్టం, వర్షాభావం (డ్రైస్పెల్) ఈ నాలుగింటిని ప్రామాణికంగా

(మిగతా 2లో)

ఇది కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో వర్షపాత నమోదు పరికరం. ప్రస్తుతం కరీంనగర్ మరో రెండు మండలాలుగా ఏర్పడగా కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయాలు కూడా పక్కపక్కనే.. మూడు మండలాలకు ఇదే ఆధారం.. పర్యావరణ సమతుల్యత లోపంతో ఒక గ్రామంలో వర్షం పడితే మరో గ్రామంలో భానుడి ప్రతాపం ఉంటోంది. అలాంటప్పుడు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల ప్రజలకు ఒనగూరేదేమిటి.?

ప్రసవాలు పెరిగాయ్!



- ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు
- ఆసక్తి చూపుతున్న గర్భిణీలు

నెలలవారీగా ప్రసవాల సంఖ్య
మే 400
జూన్ 403
జులై 501
ఆగస్టు(15వరకు) 316

గతంలో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ప్రసవాలు చేయించుకోవాలంటే వెనకడుగు వేసే గర్భిణీలు ఇప్పుడు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, కొద్దిగా మెరుగైన వైద్యాన్ని చూసి ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల ప్రసవాల సంఖ్య పెరగడమే ఇందుకు నిదర్శనం.. 'అమ్మ లాలన'తో పాటు కేసీఆర్ కిట్లను అందజేయడం ఇందుకు దోహదపడుతోంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీల పేర్లను ఎప్పటికప్పుడు నమోదు చేసి వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లడం, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందేలా చూడటం ఉపకరిస్తోంది. కరీంనగర్ జిల్లాలో గత ఆరు నెలల కిందట ప్రసవాల సంఖ్యను పరిశీలిస్తే నెలకు 300 వరకు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 500లకు చేరింది. (వివరాలు 2లో)



కరీంనగర్ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన గర్భిణులు

ఇసుక.. మస్కా!

ఇసుక వ్యాపారం అక్రమార్కులకు వరంగా మారింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో లభించే ఇసుక నాణ్యమైనది కావడంతో మంచి డిమాండ్ ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు ఇసుక వ్యాపారులు ఇక్కడి మానేరు, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను హైదరాబాద్‌తో పాటు, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నిర్మాణాల పేరిట అక్రమంగా తరలిస్తున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ఇసుకను నిల్వ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న దృశ్యం (దాచిన చిత్రం)





కొదురుపాకలో ఇసుకను నింపుతున్న దృశ్యం

- రెండు పడక గదుల ఇళ్ల పేరిట అక్రమ రవాణా?
- టాస్క్‌ఫోర్సు, ఆర్టీఏ దాడుల్లో పట్టుబడుతున్న వాహనాలు
- భూగర్భ గనుల శాఖలో సిబ్బంది కొరత

న్యూస్‌టుడే, తెలంగాణచౌక్(కరీంనగర్)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ఇసుక అక్రమ వ్యాపారులకు వరంలా మారిందన్న ఆరోపణలున్నాయి. మధ్య మానేరు ముంపు పరిధిలో(కొదురుపాక గ్రామ సమీపంలో) ఇసుకను రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించింది. ఇక్కడి నుంచి జగిత్యాల, జనగామ, మేడ్చెల్, సిద్ధిపేట, జీహెచ్ఎంసీ హైదరాబాద్‌కు ఇసుకను కేటాయించారు. ఇందుకోసం ఎలాంటి సీనరేజీ వసూలు చేయడం లేదు. గుత్తేదారు యంత్రాలను పెట్టుకొని ఇసుకను లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. అవసరమైన ఇసుకను తరలించడానికి రెండు పడక గదుల ఇళ్లు చూసే అధికారి ఏ మేరకు ఇసుక అవసరమో ధ్రువీకరణ పత్రం తెస్తే దానిని బోయినిపల్లి తహసీల్దార్ ధ్రువీకరించి కూపన్లు జారీ చేయాలి. దీంతో పాటు క్వారీలో వీఆర్ఓలు లారీ నంబర్లు, జారీ చేసిన కూపన్లను సరిచూసి లోడింగ్ చేయించాల్సి ఉంటుంది. వాహనం బయటకు వెళ్లేటప్పుడు టీఎస్ఎండీసీ అధికారులు చెక్ చేసి వాహనాలను బయటకు పంపిస్తారు. ఇసుక పక్కదారి పట్టకుండా పరిశీలించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంది. ఇక్కడే అక్రమాలకు తెరలేచింది.. రెండు పడక గదుల ఇళ్ల పేరు చెప్పి వ్యాపారులు దర్జాగా హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్నారు. మామూళ్ల మత్తుకు అలవాటు పడిన కొందరు అధికారులు చూసీ

(మిగతా 2లో)

ప్రసవాలు పెరిగాయ్!

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

కరీంనగర్ జిల్లాలో ఒక జిల్లా కేంద్ర ఆసుపత్రి మూడు 30 పడకల ఆసుపత్రులు, మరో 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గతంలో ప్రతి నెలా 300కు పైగా మాత్రమే ప్రసవాలు జరిగాయి. ఈ సంఖ్య పెంచాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కసరత్తు జరుగుతోంది. ప్రతి నెలా 1200 మంది గర్భిణిలు ప్రసవాల కోసం పేరు నమోదు చేసుకుంటున్నారు. వీరిలో 50 శాతం పైగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మిగిలిన వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు చేయించుకుంటున్నారు. జిల్లాలో హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి ఆసుపత్రుల్లో ఎక్కువ సంఖ్యలో ప్రసవాలు జరుగుతాయి. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ ఈ సంఖ్య పెరిగింది. కొత్తపల్లితో పాటు కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలు పెరిగాయి. అసలే ప్రసవాలు చేయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ నెల మొత్తం మీద ఒకటి, రెండు ప్రసవాలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా మొత్తం మీద కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట ఆసుపత్రుల పరిధిలోనే శస్త్ర చికిత్సలు జరుగుతాయి. మిగిలిన ఆసుపత్రుల పరిధిలో సాధారణ ప్రసవాలు మాత్రమే చేస్తారు. శస్త్రచికిత్సల కోసం ఇతర ఆసుపత్రులకు తరలిస్తారు. ఈ విషయంలో ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు సమకూర్చి శస్త్రచికిత్సలు చేయించి ప్రసవాలు జరిగిన తర్వాత గర్భిణులను ఇంటింకి పంపించే సౌకర్యం 'అమ్మ లాలన' ద్వారా కల్పించడంతో కొంత ప్రయోజనం కలుగుతోంది. నాలుగు నెలల్లో ఈ సంఖ్య పెరగ్గా.. సెప్టెంబరు నాటికి 600లకు పైగా ప్రసవాలు చేయించాలని కసరత్తు చేస్తున్నారు. కరీంనగర్‌లోని మాతా శిశు సంక్షణ కేంద్రంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తే ప్రతి నెలా 500 వరకు ప్రసవాలు జరిగి వీటి సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మరిన్ని సౌకర్యాల కల్పన : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండటమే కాకుండా అవసరమైన సౌకర్యాలను సమకూర్చేందుకు నిధులు ఖర్చు చేస్తున్నారు. శస్త్రచికిత్సలు జరిగే మాతా శిశు సంరక్షణ కేంద్రంలో వైద్యులను సిబ్బందిని నియమిస్తున్నారు. హుజూరాబాద్ ఆసుపత్రుల్లో మత్తు సూది ఇచ్చే వైద్య పోస్టు భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేశం తెలిపారు. జమ్మికుంటలోనూ గైనకాలజిస్టు, అనస్థీషియన్లను అందుబాటులో ఉంచనున్నారు. ప్రసవాలు నిర్వహించే లేబర్ గదులను మెరుగుపర్చనున్నారు. వైద్య విధాన పరిషత్తు పరిధిలోకి కొత్త ఆసుపత్రులను తీసుకురావాలన్న ఆలోచనలో భాగంగా హుజూరాబాద్ ఆసుపత్రిని 100 పడకల స్థాయికి పెంచే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జిల్లా పాలనాధికారి సైతం నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ ప్రసవాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తున్నారు.

వర్ష'పాత లెక్కలు'.. అన్నదాతకు చిక్కులు!

(మొదటిపేజీ తరువాయి) తీసుకుని కరవు ప్రాంతంగా ప్రకటిస్తారు. అలాగే అకాల వర్షం, వడగళ్ల వాన వల్ల రైతులకు నష్టం జరిగితే 35 శాతం పంట నష్టపోయిన పరిహారం అందుతుంది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతులకు మేలు చేసేందుకు విధానాలను సవరిస్తుంటే యంత్రాంగ తీరు మాత్రం విమర్శలకు తావిస్తోంది.

వర్షపాత నమోదులో ఒక్కో లెక్క..

వర్షపాత నమోదులో ప్రణాళిక శాఖకు సంబంధించి పక్కాగా సాగుతుండగా వాతావరణ శాఖకు సంబంధించిన వర్షపాతానికి సగానికి పైగా వ్యత్యాసం ఉంటోంది. గతంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు గుర్తించగా ప్రస్తుతం అవే తప్పులు దొర్లుతున్నాయి. మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ముఖ్య ప్రణాళిక శాఖకు సంబంధించిన ఉద్యోగులు వర్షపాతాన్ని కొలుస్తుంటారు. విద్యుత్తు సబ్‌స్టేషన్లలో వాతావరణ విభాగానికి చెందిన అధికారులు ఆటోమెటిక్ వెదర్ రిపోర్టు కోసం పరికరాలను ఏర్పాటు చేస్తుంటారు. ఇందులో ప్రణాళిక శాఖకు వర్షపాతంలో 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైతే.. సబ్‌స్టేషన్లలో మాత్రం 25 మిమీల వర్షపాతం చూపిస్తోంది. వర్షపాతం నమోదు చేసే సమయంలో వాతావరణ, ప్రణాళిక శాఖలది ఒక్కో విధానం.. ప్రణాళిక శాఖకు సంబంధించి ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో డీటీలను ప్రత్యేకంగా వర్షపాతం కొలిచేందుకు నియమిస్తారు. వర్షం పడిన సమయంలో రికార్డులో నమోదు చేసి వాటిని జిల్లా కేంద్రంలోని ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయానికి పంపిస్తారు. నమోదైన వర్షపాతంలో విచలనం 20 శాతం కంటే అదనంగా నమోదైతే దాన్ని అధిక వర్షపాతంగా, నమోదైన వర్షపాతంలో విచలనం 19 నుంచి +19శాతం వరకు వర్షం ఉంటే దానిని సాధారణ వర్షపాతంగా భావిస్తారు. వర్షపాతంలో వర్షపాత విచలనం 60 నుంచి -99 వరకు ఉంటే అతి తక్కువ వర్షపాతంగా లెక్కిస్తారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 2.



ఇది గన్నేరువరం మండల తహసీల్దార్ కార్యాలయం. కొత్త మండలంగా ఏర్పడినా వర్షపాత నమోదు పరికరం ఏర్పాటు చేయలేదు. 3 కి.మీ దూరంలోని ఖాసీంపేట వర్షపాత నమోదే దీనికి ప్రామాణికం. వాస్తవానికి ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

5 ఎంఎం వరుసగా 21 రోజుల వరకు పడకపోతే వర్షాభావంగా పరిగణిస్తారు. వాతావరణ విభాగంకు సంబంధించి సబ్‌స్టేషన్‌లో ఉన్న పరికరంలో వర్షం పడినపుడు చినుకులు అందులో చేరుతుంటాయి. ఒక్కోసారి వరుసగా చినుకులు పోయినా వర్షపాతం ఎక్కువగా నమోదవుతోంది. అప్పుడు సెన్సార్‌లో ఉన్న సిమ్‌కు సాంకేతాలు అంది నేరుగా దిల్లీలోని వాతావరణ విభాగానికి గణాంకాలు చేరుతాయి. ఈ సమస్య ఉత్పన్నమవుతుండగా సంబంధిత యంత్రాంగం మొద్దు నిద్రలో ఉండటం గమనార్హం.

పంచాయతీల్లో పరికరాలెక్కడ?

ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంగా వర్షపాత నమోదు పరికరాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రం ఆదేశించగా ఆచరణలో అటకెక్కింది. 5వ వంతు గ్రామాల్లో మినహా పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ వైపు మండల యూనిట్‌ను తొలగించి రైతులకు గ్రామం, సర్వే నంబర్ ఆధారంగా నష్ట పరిహారమిస్తామని ప్రకటిస్తుండగా తదనుగుణంగా చర్యలు కరవయ్యాయి. వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో ఓ చోట వర్షం పడితే సమీపంలోనే పడటం లేదు. అంతా 100 మీటర్ల వ్యత్యాసంలో వర్షం పడటం, పడకపోవడం చూస్తూనే ఉన్నాం. గ్రామ, గ్రామానికి మధ్య వర్షం భిన్నంగా వ్యవహరిస్తున్నందున గ్రామాల్లో రెయిన్‌గేజ్‌ల ఏర్పాటు అత్యవసరం. రెండేళ్ల కిందట ఖరీఫ్‌లో కరవు మండలాల సమయంలో ఉమ్మడి జిల్లాలో 19 మండలాలను మాత్రమే కరవు మండలాలుగా ప్రకటించారు. గ్రామాల్లో రెయిన్ గేజ్‌లు ఉన్నట్లయితే పరిస్థితి మరోలా ఉండేది. ఉమ్మడి జిల్లాలో రెయిన్‌గేజ్‌లు తహసీల్దార్ కార్యాలయానికి ఒకటి చొప్పున 57 ఏర్పాటు చేయగా వాతావరణ విభాగానికి సంబంధించి 119 ఆటోమెటిక్ వెదర్ రిపోర్టు కేంద్రాలున్నాయి.

కర్ణాటక విధానమే ఉత్తమం

కర్ణాటక రాష్ట్రంలో వర్షపాతం నమోదు చేసేందుకు రెండు, మూడు గ్రామాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయడంతో అక్కడి రైతులకు ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది. అకాల వర్షాలు, వడగళ్ల వాన, కరవు పరిస్థితులు ఏర్పడినప్పుడు అన్నదాతలకు అభయంగా మారాయి. వర్షపాతం కొలిచేప్పుడూ ఎలాంటి వ్యత్యాసం ఉండకుండా ఎప్పటికప్పుడు పరికరాలను మారుస్తూ ఉంటారని అధికార వర్గాలు చెబుతున్నాయి. సదరు విధానం ఇక్కడ అమలైతే రైతులకు ఎంతో ప్రయోజనకరం.. ఇదిలాఉంటే వర్షపాత నమోదు పకడ్బందీగా చేస్తున్నామని తమపరంగా ఎలాంటి తప్పులు లేవని ప్రణాళిక అధికారులు వివరించగా.. ప్రతి గ్రామ పంచాయతీలో వర్షపాత నమోదు పరికరాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వాతావరణ విభాగ అధికారులు చెబుతున్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై హుజూరాబాద్ మండలం బోర్నపల్లి గ్రామశివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడినట్లు బ్లూకోట్ పోలీసులు, గ్రామస్థులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్‌కు చెందిన కందుకూరి హరికుమారచారి(55), బుర్ర చంద్రమౌళి(49) అనే ఇద్దరు వ్యక్తులు మండలంలోని సింగాపూర్ కిట్స్ యంత్ర కళాశాలలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వర్తిస్తున్నట్లు వివరించారు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్ వైపునకు వస్తుండగా



మృతి చెందిన హరికుమారాచారి



గాయపడ్డ చంద్రమౌళి

వాహనం అదుపు తప్పి తీవ్రగాయాలతో రోడ్డుపై పడి ఉన్నట్లు వివరించారు. సమాచారం అందుకున్న బ్లూకోట్ పోలీసు సిబ్బంది బూస సంపత్‌కుమార్, అలికే ఎల్లయ్య, అనిల్, శ్రీనులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్షతగాత్రులను ప్రయివేటు వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా హరికుమారాచారి మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. చంద్రమౌళికి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు సూచించారు. హరికుమారచారికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. సమాచారం అందుకున్న తోటి ఉద్యోగులు ఆసుపత్రికి చేరుకొని మృతుని కుటుంబీకులను పరామర్శించారు.

ఇసుక.. మస్కా!

(మొదటిపేజీ తరువాయి) చూడనట్లు వ్యవహరిస్తున్నట్లుతెలిసింది. గతేడాదీ ఇసుక అక్రమ రవాణా జరగడంతో మంత్రి కేటీఆర్ స్పందించి కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు అక్రమంగా నిల్వ చేసిన డంపులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విక్రయించడం ద్వారా రూ.90 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అనంతరం అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.



అధికారులు పట్టుకున్న లారీలు (దాచిన చిత్రం)

ఉమ్మడి జిల్లాలో : కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అధికారికంగా ఖాజీపూర్, కొత్తపల్లి, కొదురుపాక, కొడిముంజ, మల్లారంలో ఇసుక రీచ్‌లు నడుస్తున్నాయి. ప్రస్తుతం కొదురుపాక ఇసుక క్వారీ గుత్తేదారులకు ఇచ్చిన గడువు ముగియడంతో మూసివేశారు. నిత్యం ఇక్కడి నుంచి వందలాది లారీల ద్వారా ఇసుకను హైదరాబాద్ తరలిస్తున్నారు. క్వారీలలో టీఎస్‌యండీసీ అధికారుల పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్వారీలలో అదనంగా బకెట్‌కు రూ.500 నుంచి వెయ్యి రూపాయలు తీసుకుంటూ లారీల్లో అదనంగా ఇసుక నింపుతున్నారని, టీయండీసీ నియమించిన సిబ్బంది ఇందుకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు క్వారీల్లో సీసీ కెమేరాలు పనిచేయడం లేదని తెలిసింది. ఇసుక వ్యాపారులు ఒకే వేబిల్లుపై పలు మార్లు ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల టాస్క్‌ఫోర్సు అధికారులు, ఆర్టీఏ అధికారులు పట్టుకున్న వాహనాల్లో ఎక్కువగా వే బిల్లులు లేనివి, అధిక లోడుతో వెళ్తున్న వాహనాలే ఉండటం విశేషం..

సిబ్బంది కొరత : జిల్లాల విభజన నేపథ్యంలో మైనింగ్ విజిలెన్స్‌ను భూగర్భ గనుల శాఖలో విలీనం చేశారు. దీంతో పాటు ఉన్న సిబ్బందిని ఇతర జిజిల్లాలకు బదిలీ చేశారు. దీంతో సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది. ఒకవైపు కార్యాలయ విధులు, గ్రానైట్‌పై నిఘా, మరోవైపు సర్వేలు, కొత్తవాటికి అనుమతులతోనే సరిపోతోంది.. దీంతో ఇసుక అక్రమ రవాణాపై ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు అక్రమ, అధికలోడుతో వెళ్తూ పట్టుబడిన వాహనాలను పలు శాఖల అధికారులు వాటికి జరిమానా విధించడానికి భూగర్భ గనుల శాఖకు పంపిస్తున్నారు. ఓ వైపు సిబ్బంది కొరత.. మరోవైపు తమ శాఖకు సంబంధించిన పనులు చూడలేక, ఇటు వాహనాలకు జరిమానా విధించడం అధికారులకు భారంగా మారింది.

వాహనాలు పట్టుబడితే విధించే జరిమానా

వాహనం	మొదటిసారి	రెండోసారి
ట్రాక్టర్	రూ.5 వేలు	రూ.15వేలు
లారీ(పది టన్నుల కెపాసిటీ)	రూ.25 వేలు	రూ.50వేలు
లారీ(10 టన్నుల కెపాసిటీ కంటే ఎక్కువ)	రూ. 50వేలు	లక్ష
యంత్రాలు	రూ. 50వేలు	లక్ష

జరిమానాతో రూ.95 లక్షల ఆదాయం : ఇసుకను అక్రమంగా, అధిక లోడుతో తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్సు అధికారులు వాటిని భూగర్భ గనుల శాఖకు పంపించారు. జరిమానా రూపకంగా రూ.95 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇందులో 2016-17 సంవత్సరంలో 466 కేసులు నమోదు కాగా జరిమానా రూ.76.33 లక్షలు, 2017-18 సంవత్సరం జులై వరకు 73 వాహనాలు పట్టుబడగా రూ.18.91 లక్షల ఆదాయం వచ్చింది. దీంతో పాటు ఎలగందుల, ఐనాపూర్ వివిద ప్రాంతాలలో నిల్వ చేసిన 5 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక డంపులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని టీఎస్‌యండీసీ ద్వారా విక్రయించగా రూ.27.50 లక్షల ఆదాయం వచ్చింది.

జరిమానా విధించే అధికారం : అక్రమంగా రవాణా చేస్తున్న, అధిక లోడుతో ఉన్న వాహనాలను పట్టుకుంటున్న అధికారులు వాటిని భూగర్భ గనుల శాఖకు పంపుతున్నారు. ఒకవైపు సిబ్బంది లేక సతమతమవుతున్న ఆ శాఖకు మరింత పనిభారం పెరిగనట్లయింది. వివిధ శాఖల అధికారులకు జరిమానా విధించే అధికారం ఉన్నా మైనింగ్ శాఖకు పంపిస్తున్నట్లు తెలిసింది. జిల్లా పాలనాధికారి, సంయుక్త పాలనాధికారి, ఎస్పీ, ఏఎస్పీ, సబ్ కలెక్టర్, తహసీల్దార్, డీఎస్పీ, డిప్యూటీ డైరెక్టర్ (మైనింగ్), ఏడీ (మైనింగ్), జిల్లా పాలనాధికారి ద్వారా నియమితులైన అధికారులకు జరిమానా విధించే అధికారం ఉంటుంది. అలా కాకుండా అన్ని శాఖల అధికారులు పట్టుబడిన వాహనాలను భూగర్భ గనుల శాఖకు పంపడం గమనార్హం. వాహనాలు పట్టుబడినప్పుడు విడిచిపెట్టాలని ప్రజాప్రతినిధులు, నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

అక్రమ రవాణాను ఉపేక్షించం

-కోదండరాం, ఏడీ, భూగర్భ గనులశాఖ

ఇసుక అక్రమ రవాణను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించం.. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ముందుకెళ్తున్నాం.. పట్టుబడిన వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. . ఎప్పటికప్పుడు పరిస్థితిపై అధికారులకు వివరిస్తున్నాం.. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంలేదు. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

ప్రభుత్వ బడులు మూతపడొద్దు

అభివృద్ధికి ఎన్ని డబ్బులైనా ఇస్తాం : మంత్రి ఈటల ◆ ఎస్సెస్సీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

కరీంనగర్ విద్యా విభాగం, న్యూస్‌టుడే : ప్రభుత్వ విద్యాపరంగా ఎన్ని డబ్బులైనా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వ బడులు మూత పడకుండా ఇవి మా పాఠశాలలని విద్యార్థులు గర్వంగా చెప్పుకునేలా వాటిని తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన గత ఎస్సెస్సీ పరీక్షల్లో 10, 9.8 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయుల సత్కార సభలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో గేట్లు, ప్రహరీలు, తాగునీరు, మూత్రశాలల వంటి సదుపాయాల కల్పనకు ఒక్కో నియోజకవర్గానికి నాలుగైదు కోట్ల రుపాయాలను ఎమ్మెల్యేల సహకారంతో ఖర్చు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు నాలుగు కోట్ల రూపాయాలతో అధునాతన పాఠశాలల భవనాలను జిల్లాలోని ప్రథమంగా నిర్మించిన ఘనత తమదన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని సర్కారు బడులకు డ్యూయెల్ డెస్కులను దశలవారీగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి చర్యలతో బడుల్లో నాణ్యమైన విద్య బలపడిందని, ఎస్సెస్సీలో ఉత్తీర్ణత మెరుగైందని తెలిపారు. ఇదే తీరును మున్ముందు కొనసాగించి రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. ఇందు కోసం జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలలు, కేజీబీవీల ప్రిన్సిపల్స్‌తో జిల్లా యంత్రాంగం సమావేశాన్ని నిర్వహించాలని, పాఠశాలలను అధికారులు పకడ్బందీగా దత్తత తీసుకొని విద్యాప్రమాణాలు పెంచేలా అమలు చేయాలని కోరారు. కరీంనగర్ ఎంపీ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ బడుల నుంచి 16 మంది బాలలు 10 జీపీఏను సాధించడం బాధాకరమని, ఇందుకు ఉపాధ్యాయుల తప్పుకాదని, కారణాలను అన్వేషించి పరిష్కారం చూపాల్సిన దానిపై చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఎల్కతుర్తిలో ఎన్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రాంతీయ విద్యాకేంద్రాన్ని మంజూరు చేయించామని చెప్పారు. జిల్లా పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, దత్తత అధికారుల కృషి మూలంగా ఎస్సెస్సీ ఫలితాల్లో, 10 జీపీఏల్లో మంచి ఫలితాన్ని సాధించినట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వాష్ కార్యక్రమాన్ని వచ్చే నెలలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో పి.రాజీవ్, జడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, రసమయి బాలకిషన్, ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, మేయర్ రవీందర్‌సింగ్, ఎంపీపీ రమేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డిలు పాల్గొనగా, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫలితాల్లో ప్రతిభను చూపిన ఆదర్శ, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, వంద శాతం ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయులు, దత్తత అధికారులను అతిథులు సత్కరించారు.


మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

నాలుగున్నర కిలోల శిశువు జననం

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి ఓ మహిళ 4.5 కిలోల బరువు గల మగ బిడ్డకు జన్మనిచ్చింది. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన తుమ్మ మహేశ్వరి మూడో కాన్పు కోసం ఆసుపత్రిలో చేరింది. ఆమెకు ఇప్పటికే ఇద్దరు సంతానం ఉండగా రెండు సార్లు సాధారణ ప్రసవాలే జరిగాయి. ఈసారి శిశువు బరువు ఎక్కువగా ఉన్నా సాధారణ ప్రసవానికి మహేశ్వరి మానసికంగా సిద్ధం కావడంతో డ్యూటీ వైద్యుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో కాన్పు జరిగేలా చూశారు. దీంతో సాధారణ ప్రసవంతో 4.5 కిలోల బరువు గల మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చింది. మహేశ్వరి భర్త సంతోష్ తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తుండగా అతడి వెంట కూలీ పనికి వెళ్తుండేది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన మహేశ్వరిని, ఇందుకు కృషి చేసిన వైద్య సిబ్బందిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌డా. సూర్యశ్రీరావు అభినందించారు.


మగశిశువు

జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారిణుల ప్రతిభ

మార్కండేయకాలనీ, న్యూస్‌టుడే: ఇటీవల కేరళలోని అలిప్పిలో జరిగిన 42వ జాతీయ స్థాయి సీనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారిణులు శ్రీవాణి, సుప్రియ, సమ్మక్క ప్రతిభ కనబరిచి వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు శిక్షకురాలు గొట్టెముక్కుల శారద తెలిపారు. దక్షిణ భారత దేశ స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 24 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా తెలంగాణ తరఫున ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు హాజరయ్యారు. అందులో సుల్తానాబాద్‌కు చెందిన శ్రీవాణి, సమ్మక్కలు 48, 72 కిలోల బరువు ఎత్తి వెండి, కాంస్య, గోదావరిఖనికి చెందిన సుప్రియ 63 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకాలు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.


ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో శిక్షకురాలు

రాజీవ్‌గాంధీ కృషితోనే సాంకేతిక విప్లవం


రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలవేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే : సాంకేతిక విప్లవాన్ని సాధించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీదేనని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కటకం మృత్యుంజయం అన్నారు. ఆదివారం స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 73వ జయంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ఎక్కువగా ప్రోత్సహించేవారని, 18 ఏళ్లకే ఓటు హక్కు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అందుబాటులోకి తెచ్చారన్నారు. 73,74వ రాజ్యాంగ సవరణ ద్వారా స్థానిక సంస్థలను బలోపేతం చేశారన్నారు. ఆనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కర్ర రాజశేఖర్ ఆధ్వర్యంలో రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గందె మాధవి మహేశ్, వివిధ విభాగాల జిల్లా అధ్యక్షులు డి.మధు, ఒంటెల రత్నాకర్, చెర్ల పద్మ, ఉప్పరి రవి, నాయకులు రహ్మత్‌హుస్సేన్, మూల జైపాల్, రవిందర్‌రెడ్డి, మల్లేశం, మాదాసు శ్రీనివాస్, అంజన్‌కుమార్, తాజ్, సరిళ్ల ప్రసాద్, వాల రమణారావు, పి.భూమయ్య, జువ్వాడి నిఖిల్, రమేశ్, ప్రశాంత్‌దీపక్ తదితరులు పాల్గొన్నారు.

దిల్లీలో రాజీవ్‌గాంధీకి నివాళులు : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా దిల్లీలోని రాజీవ్ స్మారకం వద్ద తెలంగాణ కాంగ్రెస్ మాజీ ఎంపీలు వీర్‌భూమి రాజీవ్‌స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సురేష్ షెట్కార్, బలరాంనాయక్, సిరిసిల్ల రాజయ్యలు ఉన్నారు.

కరీంనగర్

బాధిత కుటుంబాలకు పరామర్శ

అల్గునూర్(తిమ్మాపూర్): తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్ గ్రామంలో ఇటీవల పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం పరామర్శించారు. అల్గునూర్ గ్రామానికి చెందిన వడకాపురం సత్యనారాయణ, వడకాపురం వెంకటేష్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట సర్పంచి కిష్టయ్య, బీసీ సెల్ అధ్యక్షులు పర్శరాములు, గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గాయాలు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ వద్ద జరుగుతున్న సొరంగ నిర్మాణ పనుల్లో బీహార్‌కు చెందిన అనిల్(40) అనే కూలీ ఆదివారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. వాహనంలో వచ్చిన కంకరను అన్‌లోడ్ చేస్తుండగా వాహనంపై ఉన్న విద్యుత్తు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయాలు కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

ఆత్మ ఘోష

- గ్రామాల్లో వైకుంఠ ధామాల నిర్మాణానికి నిర్ణయం
- హద్దుల నిర్ణయంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- ముందుకు సాగని నిర్మాణ పనులు



☛ శ్మశాన వాటికగా పేర్కొంటూ బోర్డు పాతిన ఈ స్థలం ఆసిఫ్‌నగర్ గ్రామంలోనిది. గతంలోనే ఆర్డీవో స్థలాన్ని కేటాయించారు. నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి చేసేందుకు ఉపాధి హామీ ద్వారా నిధులు మంజూరయ్యాయి. రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించకపోవడంతో పనులు ప్రారంభించే అవకాశం లేకుండా పోయింది.

న్యూస్‌టుడే, కరీంనగర్ గ్రామీణం

గ్రామాల్లో వైకుంఠ ధామాల నిర్మాణానికి అడ్డంకులు తప్పడం లేదు. నిధులున్నా పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. పంచాయతీలు ప్రతిపాదించిన ప్రభుత్వ స్థలాలను రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించడంలో నిర్లక్ష్యం నెలకొనడంతో నెలలు గడిచినా పనుల్లో పురోగతి లేకుండా పోతున్న తీరుపై 'న్యూస్‌టుడే' కథనం.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా గ్రామాలు విస్తరిస్తున్నాయి. శివారు పల్లెలు కూడా వేగంగా వృద్ధి చెందడంతో జన సాంద్రత పెరుగుతోంది. కానీ శ్మశాన వాటికలు అందుబాటులో ఉండటం లేదు. పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.. అంత్యక్రియలు, దహన సంస్కారాలు నిర్వహించేందుకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో రెండు మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. కొన్ని గ్రామాల్లో స్థలాలు లేక వాగులు, చెరువు శిఖం స్థలాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో వాగులు ప్రవహించడం, చెరువులు నీటితో నిండడం, శిఖం స్థలాల్లో పంటలు సాగు చేస్తుండడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో అన్ని రకాల వసతులు, సౌకర్యాలతో 'వైకుంఠ ధామం' పేరుతో ప్రతి ఊరిలో శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. ప్రస్తుతం అందుబాటులో స్థలం ఉండి సరైన సౌకర్యాలు లేని వాటితో పాటు కొత్తగా ప్రతిపాదించిన ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపట్టనుంది. అంతగా ఆదాయం లేని పంచాయతీలతో పాటు చిన్న పల్లెలకు ఇదొక మంచి అవకాశం.



☛ ఈ చిత్రంలోని స్మశాన వాటిక ముగ్దుంపూర్ గ్రామంలోనిది. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున ఇక్కడే కొత్తగా వైకుంఠధామం నిర్మాణానికి ప్రతిపాదించారు. కాని రెవెన్యూ అధికారులు సర్వేచేసి హద్దులు నిర్ణయించడంలో జాప్యం జరగడంతో మంజూరుకు నోచుకోవడం లేదు.

8 ప్రతిపాదనలు.. 2 మంజూరు

కరీంనగర్, కొత్తపల్లి మండలాల్లో ఎనిమిది శ్మశాన వాటికల నిర్మాణానికి పంచాయతీలు ప్రతిపాదించాయి. కరీంనగర్ గ్రామీణ మండలంలో నగునూరు, జూబ్లీనగర్, తీగలగుట్టపల్లె, ముగ్ధుంపూర్, బహదూర్‌ఖాన్‌పేట, కొత్తపల్లి మండలంలో చింతకుంట, నాగులమల్యాల, ఆసిఫ్‌నగర్ గ్రామాల్లో ప్రతిపాదించారు. శ్మశాన వాటికల నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రభుత్వ భూమి వివరాలు, నిర్మాణాలు చేపట్టేందుకు నిర్ణయించిన స్థలం వివరాలను తెలియజేస్తూ ఉపాధి హామీ పథకం అధికారులకు ప్రతిపాదనలను సమర్పించారు. ఒక్కో వైకుంఠధామం నిర్మాణానికి కనీసం 20 గుంటల నుంచి ఎకరం వరకు స్థలం ఉండాలి. రెండు మండలాల్లో 8 ప్రతిపాదనలకు గాను ఆసిఫ్‌నగర్, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాలకు ఉపాధి హామీ ద్వారా వైకుంఠధామాలు మంజూరయ్యాయి. మిగిలిన 6 గ్రామాల్లోనూ గ్రామసభ తీర్మానాల్లో పేర్కొన్న స్థలాలకు హద్దులు గుర్తించి పంచాయతీలకు స్వాధీనం చేయడం కోసం ఉపాధి హామీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయాలకు దస్త్రాలను పంపించారు. నెల రోజులు గడిచినా సర్వే చేసి హద్దులు చూపడంలో జాప్యం జరుగుతోంది. సర్వే పూర్తి చేసి హద్దులు నిర్ణయిస్తే సత్వరమే మంజూరు వచ్చే అవకాశం ఉంది. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.10లక్షలతో నిర్మాణాలు

స్థలం ఉండి వినియోగానికి వీలు లేకుండా చెత్తాచెదారం, ముళ్లపొదలతో ఉన్నట్లయితే ఉపాధి హామీ కూలీల చేత శుభ్రం చేయిస్తారు. ఒక్కో శ్మశాన వాటిక నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు కేటాయిస్తారు. ఇందులో దహన సంస్కారాల కోసం రెండు స్లాబ్‌లతో కూడిన ప్లాట్‌ఫాంలు, నీటి వసతి కోసం ట్యాంకు, నల్లాలు, ఒక కార్యాలయం, స్నానాల గది, రెండు మరుగుదొడ్లు నిర్మిస్తారు. ఆసిఫ్‌నగర్, బహదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉండడంతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు.

త్వరలో సర్వే చేస్తాం

శ్మశాన వాటికల కోసం ప్రతిపాదించిన స్థలాలను త్వరలోనే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయిస్తామని కొత్తపల్లి, కరీంనగర్ గ్రామీణ తహశీల్దార్లు రాజేందర్‌రావు, రాజ్‌కుమార్ తెలిపారు. సర్వేయర్లకు కూడా సూచనలు చేశామని రెండు మూడు రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



☛ ఎలబోతారం గ్రామంలోనూ శ్మశాన వాటికకు ప్రభుత్వం సర్వేనంబరు 199లో కేటాయించిన 1.20 ఎకరాల స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని గ్రామానికి చెందిన సుధాకర్ జిల్లా పాలనాధికారికి నెలన్నర కిందట విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ అధికారులు ఇంతవరకు హద్దులు నిర్ణయించకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం లేకుండా పోయిందని, కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదని వాపోతున్నాడు.



సమావేశంలో ప్రసంగిస్తున్న భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన ఓదెలు

గ్రామాల్లో భాజపా బలోపేతానికి కృషి

గోపాల్‌పూర్(కరీంనగర్ గ్రామీణం),న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో భాజపా బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన ఓదెలు అన్నారు. కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఊరడి శివారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన భాజపా మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బూత్ కమిటీలను పూర్తిస్థాయిలో బలోపేతం చేయాలని, 2019లో భాజపాను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పని చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ, వ్యవసాయ తీర్మానాలు చేశారు. సమావేశంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి బాసవేని మల్లేశం యాదవ్, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి గాజుల చంద్రయ్య, నాయకులు నందకుమార్, మునిగంటి కుమార్, భాజయూమో మండల అధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌పీపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన

కరీంనగర్ విద్యా విభాగం, న్యూస్‌టుడే : స్థానిక పారమిత పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎన్‌ఎల్‌పీపై ఆదివారం స్థానిక ఓ వేడుక మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ ఎన్‌ఎల్‌పీ నిపుణులు సత్య త్రిమూర్తి మాట్లాడుతూ మానవ శరీరంలోని మెదడును 10 శాతం మాత్రమే వాడుతున్నామని చెప్పారు. ఎన్‌ఎల్‌పీ ద్వారా దాన్ని 85 శాతం వరకు ఉపయోగించడంతో పాటు ఆక్సిజన్‌ను ఎక్కువగా అందేలా చేస్తూ కోపం, రోగాలు, ఒత్తిడిలకు దూరంగా నిలవవచ్చని వివరించారు. పారమిత విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల కోసం కొన్ని రోజులుగా ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, మనిషిలోని లోపాలను సవరిస్తూ వారిలోని నైపుణ్యాలను వెలుగులోకి తెచ్చేందుకు వీటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు రశ్మిత, అనూకర్‌రావు, సీజీఎం వినోద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో అఖండ రుద్రాభిషేకాలు

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: పవిత్ర శ్రావణ మాస శివరాత్రి, ఆదివారం చివరి రోజును పురస్కరించుకొని నగరంలోని శివాలయాల్లో ఉదయం నుంచి అఖండ రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం అమావాస్య పురస్కరించుకొని ఆవుపాలతో శివలింగానికి అభిషేకాలు, బిల్వార్చనలు, విశేష పుష్పాలంకరణలు, అఖండ భజనలు నిర్వహించారు. పాతబజారు శివాలయంలో అన్నపూజ మహావైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రి ఆదివారం రోజు ఉదయం 7 గంటల నుంచి శివాలయం కళాబృందంచే రామేశ్వరాలయంలో రామ పునర్వసు రాగ నీరాజనం నిర్వహించారు. ఆలయ కార్యదర్శి చల్లా మోహన్‌రెడ్డి, ఉప్పల రామేశం, భక్తులు పాల్గొన్నారు.





పాతబజారు శివాలయంలో అన్నపూజలు; శివలింగానికి అలంకరణలు

ప్యానల్ న్యాయవాదులకు శిక్షణ తరగతులు

కరీంనగర్ న్యాయవార్తలు, న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల ప్రకారం కరీంనగర్ జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఛైర్మన్, జిల్లా జడ్జి వి.వి.పార్థసారథి ఆధ్వర్యంలో, ప్యానల్ న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలోని మీడియేషన్ కేంద్ర భవన్‌లో శని, ఆదివారం రెండు రోజుల పాటు రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నియామకమైన 40 మంది న్యాయవాదులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన మాస్టర్ ట్రైనర్స్ ఎస్.నంద, జి.నారాయణ, రాజ్‌కుమార్, సుబేదారి న్యాయవాదులకు వివిధ చట్టాల గురించి వారి బాధ్యతల గురించి గ్రూప్ డిస్కషన్, పవర్ పాయింట్ ప్రోగ్రాం, క్విజ్, ప్రోగ్రాంల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ.. ప్యానల్ న్యాయవాదులు కక్షిదారులకు సరైన సలహాలు ఇవ్వటమే కాకుండా వారికి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మురళీధర్, కృష్ణమూర్తి, నాగరాజు, శ్రీనివాస్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు. ఎవరైనా కక్షిదారులు స్తోమత లేక తమ కేసులు వాదించుటకు న్యాయవాదులను నియమించుకోలేని సందర్భంలో, వారు కోర్టుకు విన్నవించుకుంటే న్యాయ సేవా సంస్థ ద్వారా ప్యానల్‌లో పేర్కొన్న న్యాయవాదిని వాదించేందుకు నియమిస్తామన్నారు.



శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

రేకుర్తి(కరీంనగర్ గ్రామీణం),న్యూస్‌టుడే: గణేష్ ఉత్సవాల సందర్భంగా కరీంనగర్ గ్రామీణం, కొత్తపల్లి మండలాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని తెదేపా ధర్మపురి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాడి బాల్‌రెడ్డి అన్నారు. రేకుర్తి గ్రామంలో ఆదివారం జరిగిన తెదేపా గ్రామశాఖ సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాల్లో రోడ్లు సరిగా లేనందున నిమజ్జనం సందర్భంగా ఇబ్బందులు లేకుండా ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలని కోరారు. రేకుర్తిలో బురద రోడ్లకు పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించాలని కోరారు. నాయకులు కె.కిష్టయ్య, కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్

ఆటా అవార్డుకు ఎంపిక

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కరీంనగర్ మండలం చామనపల్లి జడ్పీ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వైరాగ్యం ప్రభాకర్ ఆటా ఇండియా అవార్డుకు ఎంపి కయ్యారు. ఈ మేరకు ఆటా జాతీయ అధ్యక్షులు బెక్కంటి శ్రీనివాసరావు సమాచారం అందించారని ప్రభాకర్ తెలిపారు. అక్టోబరు 8న భద్రాచలంలో జరిగే కార్యక్రమంలో అవా ర్డును అందజేయనున్నారని, ఉపాధ్యాయ వృత్తితో పాటు సామాజిక, సేవా రంగాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారని తెలిపారు.

మీరూ స్పందించండి

మీ కాలనీలో సమస్యలా? రహదారులు దెబ్బతిన్నాయా? కాలువల్లో మురుగు నిండిందా? రహదారుల వెంట చెత్త దర్శనమిస్తోందా?.. ఇలాంటి సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి 'ఈనాడు' మీకో అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కాలనీలో సమస్యపై ఫొటో తీసి, పేరు, చిరునామాతో ఈ కింద ఇచ్చిన వాట్సప్ నంబరుకు పంపించండి. సమస్యలను స్వయంగా పరిశీలించి ప్రచురిస్తాం.

వాట్సాప్ నంబరు : 80085 73500

సుభాష్‌నగర్, న్యూస్‌టుడే

పేరుకుపోతున్న చెత్త చెదారం



సమస్య : పెద్దపల్లి రోడ్డులోని హుస్సేనీపురలో గుడిసె గల్లీ ఇం.నం. 6-9-919 దగ్గర చెత్త చెదారం పేరుకు పోయి దుర్వాసన వస్తోంది. కొద్ది రోజులుగా అలాగే ఉండటంతో పందులు వస్తున్నాయి. ఎప్పటిక ప్పుడు చెత్త చెదారం తొలగించి శుభ్రం చేయించాలి.
- మహ్మద్ జహంగీర్, హుస్సేనీపుర

పరిష్కారం: శుభ్రం చేయిస్తాం
- పారిశుద్ధ్య విభాగం, నగరపాలిక

వీధిలైటుకు మరమ్మతులు

స్పందనకు వందనం



నగరంలోని బ్యాంకు కాలనీలోని వీఏ/8ఏ/3/1ఎల్ఈడీ వీధి లైటు వెలుగడం లేదని వచ్చిన ఫిర్యాదుపై నగర పాలక అధికారులు స్పందించి మరమ్మతులు చేయించారు. ఈనెల 17న 'ఈనాడు'లో 'లెడ్‌లైట్లు.. అవే పాట్లు' అనే కథనం రావడంతో ఆ మేరకు మరమ్మతులు చేయించారు. వాట్సాప్ సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నట్లు ఏఈ వెంకట్ కుమార్ తెలిపారు.

అధ్వానంగా మారిన హుస్సేనీపుర రోడ్డు



సమస్య : నగరంలోని 8వ డివిజన్ పరిధిలోని హుస్సేనీపుర ప్రాంతంలో రహదారులు అధ్వానంగా మారాయి. ఏ వీధికి వెళ్లిన అడుగడుగునా గుంతలు ఉండటంతో రాకపో కలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే చాలు రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేయాలి.
- ఎం.డి.సిరాజుద్దీన్, హుస్సేనీపుర

పరిష్కారం: త్వరలో ప్యాచ్‌వర్క్ పనులు చేయించడం జరుగుతుంది.
- ఇంజినీరింగ్ విభాగం అధికారి, నగరపాలిక

నెలల తరబడి రోడ్డు మీదనే కంకర



కోతిరాంపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఇం.నం. 8-7-140వైపు కొత్తగా రోడ్డు వేసేందుకు కంకర తీసుకొచ్చి పోశారు. ఇంకేముంది నెలలు గడుస్తున్న రోడ్డు వేయకపోగా ఆ కంకరతో రాకపోకలు సాగించే వారికి ఇబ్బందికరంగా మారుతుంది. రోడ్డుపై అడ్డంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే పనులు పూర్తి చేయాలి.
- మనోహర్, కోతిరాంపూర్

పరిష్కారం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- ఇంజినీరింగ్ విభాగం అధికారి, నగరపాలిక



భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యున్ని సన్మానిస్తున్న దృశ్యం

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే : జిల్లాలో భాజపాను బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నెబోయిన ఓదెలుయాదవ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో యాదవ మహాసభ జిల్లా, నగర శాఖల ఆధ్వర్యంలో పార్టీ కార్యవర్గ సభ్యునిగా నియమితులైన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఓదెలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో లేకపోయినా, తెలంగాణ అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తుందన్నారు. గోకుల్ ట్రస్ట్ అధ్యక్షులు కాల్వ నర్సయ్యయాదవ్ మాట్లాడుతూ.. తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రాష్ట్రస్థాయికి ఎదగడం అభినందనీయమని, యాదవసంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుంప్రరాజయ్య, నగర అధ్యక్షులు గాలి రవి తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో పని లేకుండా తిరగొద్దు : సీఐ

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఏ పని లేకుండా రాత్రి సమయాల్లో రోడ్లపై తిరగవద్దని, అకారణంగా తిరిగినా, రోడ్ల పక్కన అడ్డాలు వేసి, దారిన పోయే వారిని వేధింపులకు గురిచేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రెండో ఠాణా సీఐ టి.మహేష్‌గౌడ్ అన్నారు. ఆపరేషన్ నైట్‌సేఫ్టీలో భాగంగా రెండో ఠాణా పరిధిలో శనివారం రాత్రి 11 గంటల నుంచి 2 గంటల వరకు ప్రత్యేక తనిఖీలను నిర్వహించారు. ద్విచక్రవాహనాలపై తిరుగుతున్న 60 మందిని పట్టుకుని రెండో ఠాణాకు తరలించారు. ఆదివారం వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాత్రి సమయాల్లో తిరుగుతున్న యువత మద్యం, మత్తు పదార్థాలకు అలవాటుపడి, నేరాలకు పాల్పడుతూ జీవితాన్ని నాశనం చేసుకొంటున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రుల్లో తిరుగుతున్న యువతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల పత్రాలు లేకుండా, ముగ్గురు ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుంగిన దారి.. పట్టించుకునేవారేరీ?



నగరంలోని అశోక్‌నగర్ నుంచి నాకా చౌరస్తా వైపు వెళ్లే ప్రధాన రహదారి కుంగింది. పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గొయ్యి కనిపించడం కోసం జెండాలను సూచికగా ఏర్పాటు చేశారు స్థానికులు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఆ కుంగిన రహదారికి మరమ్మతులు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, సుభాష్‌నగర్

వచ్చే రూ.100కోట్లతో అంతర్గత రహదారుల అభివృద్ధి

సమన్వయంగా పని చేసుకోవడానికి అంగీకారం ● ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్ల అంతర్గత నిర్ణయం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రెండు రోజులుగా తీవ్ర దుమారం లేపిన రూ.100 కోట్ల పనుల సమస్య కొలిక్కి వచ్చేటట్లుంది. నగరపాలక ద్వారా కాకుండా ఇతర శాఖల ద్వారా, నిధులు అప్పగించి పనులు చేయిస్తున్నారనే విషయంలో కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ అంశంపై ఆదివారం సాయంత్రం మేయర్ రవిందర్‌సింగ్, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్, కార్పొరేటర్లతో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అంతర్గత సమావేశం నిర్వహించారు. తెరాసకు చెందిన 34 మంది కార్పొరేటర్లు ఉండగా, 22 మంది కార్పొరేటర్లు హాజరు కాగా, 12 మంది గైర్హాజరయ్యారు. సుమారు మూడు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యే, మేయర్ మధ్య వాడీవేడిగా చర్చ జరిగినట్లు సమాచారం. సీఎం, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల ప్రకారం ఈ వంద కోట్ల నిధులు ఇతర శాఖల ద్వారా జరిపిస్తున్నారని, నగరపాలకలో రూ.30 కోట్లకు ప్రత్యేకంగా టెండర్లు పిలువడంపై మంత్రి అభ్యంతరం తెలపడంతో మెమో జారీచేశారని తెలిపినట్లు తెలిసింది. అయితే ఇప్పటివరకు టెండర్లు నిర్వహించిన పనులు రద్దు చేస్తున్నారని తెలియడంతో కార్పొరేటర్లు ఆగ్రహించారని, పూర్తిగా నిధులు ఇతర శాఖల ద్వారా జరిపిస్తున్నారని పేర్కొనడంతో కార్పొరేటర్లు మనస్తాపానికి గురయ్యారని వివరించారు. మున్సిపాలిటీని కించపర్చే ప్రసక్తే లేదని, నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరినట్లు సమాచారం. గతంలో భూగర్భ డ్రైనేజీ నిధులు రూ.75 కోట్లు ప్రజారోగ్యశాఖకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించలేదా? ఇప్పుడు ఆ పార్టీ రాజకీయం చేయడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రతిపక్షలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా అభివృద్ధి పనులకు భారీగా నిధులు తీసుకురావడం జరుగుతుందని తెలిపినట్లు సమాచారం. అంతర్గత రహదారులకు ప్రత్యేకంగా రూ.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడానికి సిద్ధంగా ఉందని, అంతేకాకుండా వచ్చే రూ.100 కోట్లతో నగరంలోని అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు నగరపాలక ద్వారా జరిపించేలా కృషి చేస్తామన్నారు. ఇక మీదట అంతర్గత విభేదాలు మానుకొని నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మొత్తానికి రూ.వందకోట్లపై వచ్చిన అభ్యంతరాలు సమసిపోయినట్లేనని పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు పేర్కొనడం గమనార్హం.

ఎంపీ వినోద్‌ను కలిసిన కార్పొరేటర్లు

రూ.100 కోట్ల నిధులు ఇతర శాఖల ద్వారా కాకుండా, నగరపాలక ద్వారా ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని తెరాసకు చెందిన పలువురు కార్పొరేటర్లు ఎంపీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం కరీంనగర్‌లో తెరాసకు చెందిన 25 మంది కార్పొరేటర్లు ఎంపీ వినోద్‌కుమార్‌ను కలిశారు. 50 మంది కార్పొరేటర్లు, నగరపాలకలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసే ఇంజినీర్లు ఉండగా, ఉద్యోగులు లేని శాఖలకు ఇవ్వడంపై ఫిర్యాదు చేశారు. నగరానికి కేటాయించిన నిధులు నగరపాలకకు ఇవ్వకపోవడంతో తమ మనోభావాలు దెబ్బతినేలా ఉందని, ఇతర శాఖలకు కేటాయిస్తూ మెమో ఇవ్వడాన్ని రద్దు చేయాలని కోరారు. అదే విధంగా ఎల్ఆర్ఎస్ నిధులు రూ.25 కోట్లు ఉండగా నగరపాలక ద్వారా పనులు చేసుకోవడానికి ఉత్తర్వులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీ వినోద్ అభివృద్ధి పనులు చేసుకోవడానికి అందరూ కలిసికట్టుగా ఉండాలని, వచ్చే వందకోట్లు నగరపాలక ద్వారానే పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పలువురు కార్పొరేటర్లు వివరించారు. అవసరమైతే సీఎం దగ్గర ఈ విషయాన్ని మాట్లాడి నిధులు మంజూరు చేయించడం జరుగుతుందని పేర్కొన్నట్లు తెలిపారు.

మట్టి గణపతి.. మహా గణపతి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : మట్టి గణపతి.. మహాగణపతి.. మట్టి గణపతికి జై అంటూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు కళాకారులు నగరంలో పలు చోట్ల కళాజాత ప్రదర్శనలు ఇచ్చారు. పీవోపీ విగ్రహాలను కాకుండా మట్టి గణపతులనే వినియోగించాలని కోరుతూ.. డప్పు వాయిద్యాలతో పాటలు పాడి జనాన్ని ఉత్తేజపరిచారు. వీధి నాటిక, పాటలతో కరీంనగర్ బస్టాండు ప్రాంగణంలో, కూరగాయల మార్కెట్‌లో ప్రదర్శనలు నిర్వహించారు. రసాయనిక రంగుల విగ్రహాలు వినియోగించడంతో కలిగే దుష్పలితాలు జనానికి వివరిస్తూ పాటలు పాడారు. వై.పద్మారావు ఆధ్వర్యంలో వి.కుమార్ రాజా, వి.ప్రశాంత్ కలిసి ఈ ప్రదర్శనలు ఇచ్చారు..

పెటా ఆధ్వర్యంలో క్రీడా పోటీలు 29న

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే : వ్యాయామ ఉపాధ్యాయ సంఘం(పెటా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న జిల్లా స్థాయి విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రవి, ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. క్రీడా దినోత్సవం సందర్భంగా ఈనెల 29న అండర్-12, 16 బాలబాలికలకు అథ్లెటిక్స్, అండర్-16 బాలబాలికలకు కబడ్డీ, హాకీ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడా పోటీల నిర్వహణకు క్రీడా దుసుము పెంచేలా ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్.జి.ఎఫ్.కార్యదర్శి నర్సయ్య, లక్ష్మణ్, సంపత్‌రావు, సమ్మిరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

EENADU CLASSIFIEDS

PERSONAL CLASSIFIEDS

BIRTHDAY GREETINGS



BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్లాస్టిక్ హైడ్రాలిక్ & ఇంజక్షన్ మౌల్డింగ్ మెషిన్లు. నెలకు అత్యధిక ఆదాయం సంపాదించండి, ముడిసరుకు ఇచ్చి తయారైన సరుకు కొంటాం. R.J.ఎంటర్‌ప్రైజెస్, ✆ 82978 57211.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. స్కై ఇంజినీరింగ్ కం॥, ఉప్పల్, HYD. ✆ 81063 70234.

GST సువిధ సెంటర్స్ ఫ్రాంఛైజీ కోసం జిల్లాలోని అన్ని మండలాల వారీగా INTERNET & MEESEVA మరియు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. వివరాలకు సంప్ర: 97017 51551, 91770 21347.

FOR SALE

LMD కాలనీ తిమ్మాపూర్ నందు ఫాస్ట్‌ఫుడ్ సామాగ్రి మరియు హోటల్ సామాగ్రి అమ్మబడును. Cont: 77026 73662, 98495 07178, 94403 45807.

EDUCATION

DISTANCE EDUCATION

ఒకే సం॥లో ఇంటర్/ డిగ్రీ/ SSC: Direct 10th, Inter, B.A., B.Com, BSc, BLisc, MA, M.Com, MSc, MLisc, MBA, Diploma, B.Tech (All Courses Regd UGC & DEC) Micro Chip Study Circle, MM thota, KNR ✆ 94405 21935/ 97005 59923.

REAL ESTATE

HOUSE FOR SALE

Good news for Retired People. మొదటిసారిగా బెంగుళూరు హైవే నందు కొత్తూరుకి దగ్గరలో ఇండిపెండెంట్ రిటైర్‌మెంట్ హోమ్స్ 200 sq yds లో 600 చ.అ. బిల్డింగ్ ఫర్నిచర్‌తో కలిపి కేవలం 13,50,000/- మాత్రమే Special Discount for Groups for 100 Customers upto 31st Aug-17. సంప్రదించండి ✆ 84648 50159.

కరీంనగర్‌కు 6 కిలోమీటర్ల దూరంలో చింతకుంట పరిధిలో ఆరగుంట జాగలో కంప్లీట్ ఇల్లు అమ్మబడును నో బ్రోకర్స్. Cell: 94417 29086, 81068 18446.

SHOP FOR SALE

సిరిసిల్లలో అన్ని వసతులతో కూడిన మరియు మంచి రన్నింగ్ కండీషన్‌లో గల బేకరీ & టీ పాయింట్ ఫర్నీచర్‌తో సహా అమ్మబడును. సంప్ర: సెల్: 91778 27350.

JOBS

Dynamic, Smart Candidates to Promote 2000 Acres Townships Project Assured income M/F Welcome. Ph: 9177996667

Urgently Required for a Reputed School female Cook, Primary Teacher and Male Warden.Cont: 73865 60190.

Wanted Male or Female Graduate (E/M) With Ms.Office & Internet Knowledge to work as customer service executive for tourism & Air ticketing walk in For Interview on 22nd & 23rd Aug. 2pm to 5pm . cont: Money Point Tours & Travels, Bustand road,karimnagar, Cell: 90009 01294.

MNC కంపెనీలో పని చేయుటకు యువతీ యువకులు కావలెను. అర్హత: 7th-డిగ్రీ, జీతం: 5500 నుండి 10000 వరకు. రూం, భోజనం ఫ్రీ. సంప్ర: 95730 70966, 89785 56751.

Hydలో నూతనంగా ప్రారంభించిన లి॥ కం॥కై హెల్పర్స్, ప్యాకర్స్, సూ॥వై॥ వెంటనే కా॥. జీ: 13-18 వేలు, రూం+ మీల్స్ ఫ్రీ. చదువు లేకున్నా జాబ్. స్పాట్ జాయినింగ్ సంప్ర: 9063298941

కరీంనగర్‌లోని హాస్పిటల్స్‌కి స్థానిక సెక్యూరిటి గార్డులు కావలెను. జీతం: 7500/- ESI + PF సౌకర్యం సివిల్ హాస్పిటల్ వెనుక మాక్స్‌క్యూర్ హాస్పిటల్ రఘురామ్ 96668 77880.

SBI LIFE, JAGTIALలో Unit Managers కావలెను ఏదైన డిగ్రీ, Salesలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత Salary, Incentives+ Allowances. ఎక్కువ Service ఉన్నవారికి ఎక్కువ జీతం. Cell: 97046 63322.

S.K.V.R కంపెనీలో పనిచేయుటకు BSc (కెమిస్ట్రీ), ITI ఆల్‌ట్రేడ్స్, హెల్పర్స్ ప్యాకింగ్ బాయ్స్ సూపర్‌వైజర్స్, లేడిటెలికాలర్స్ కావలెను. జీతం:10000 To 17000/-PM డైరెక్ట్ ✆ 9553650060/ 9553633437

Hyd లోని నూతనంగా ప్రారంభించిన కం॥లకై హెల్పర్స్, ప్యాకర్స్, ఆపరేటర్స్ వెంటనే కా॥ జీ: 13-18 వేలు రూం+ మీల్స్ ఫ్రీ. ESI, PF చదువులేకున్నా జాబ్ సంప్ర: 7659988595

ప్రముఖ లిమిటెడ్ కంపెనీలో పనిచేయుటకు Supervisors, Helpers, Incharges కావలెను. జీతం: 16,000+ O.T కలదు. రూం+ భోజనం ఫ్రీం. Cell: 81253 05238.

తెలంగాణ ఫిష్ వరల్డ్‌లో బండిమీద పనిచేయుటకు బాయ్స్ కావలెను. కరీంనగర్ ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి. సెల్: 84660 95630.

కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, Hydలో సెక్యూరిటీ గార్డ్స్ ASOలు కావలెను. 12 గం॥ జీ॥ 8 - 11,000/- Qly: SSC ఆపైన ✆ 9885657755/ 9885267755

స్పాట్ జాయినింగ్, డైరెక్ట్ జాబ్, Hydలో MNC కంపెనీలో పనిచేయుటకు హెల్పర్స్, సూపర్‌వైజర్స్, ప్యాకింగ్ బాయ్స్, సె॥ గార్డ్స్ కా॥, జీ: 10-20 వేలు, ఫ్రీరూం, మీల్స్, ESI, PF. ✆ 7995921759, 9000029342.

ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు X to PG అర్హత గల అభ్యర్థులు కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఉచిత భోజన వసతి కలదు. Cell. 85109 73559, 85109 73845

HYDలో గల ప్రముఖ Ltd కంపెనీలకు హెల్పర్స్, ప్యాకర్స్, సూ॥వైజర్స్, B.Sc (కెమిస్ట్రీ), ITI ఆల్‌ట్రేడ్స్ అర్జెంట్‌గా కావలెను. జీ: 10వేలు - 16వేలు, (రూం+ మీల్స్ సౌకర్యం) ✆ 7097042383/ 7330318573

ఒక ప్రముఖ Ready Mix కంపనీ (NTPC)లో పని చేయుటకు అనుభవం కల సూపర్‌వైజర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, (B.Tech/ Diploma in Civil) కావలెను. Cont: 73068 90162, 80192 66465, 98496 42244.

ఓన్ ప్లేట్ కార్ నడుపుటకు లైసెన్స్ కలిగి ఉండి అనుభవం గల వ్యక్తి కావలెను. Cont: Cell: 77319 51123, 98662 60014.

పల్లవి ఫ్యాబ్రిక్ క్లాత్ స్టోర్‌లో పని చేయుటకు లేడి వర్కర్స్ కావలెను. Add: మాంగల్య షాపింగ్ మాల్, BSNL office ప్రక్కన. Cont: 81211 73112.

మహవీర్ హాస్పిటల్‌లో పని చేయుటకు అనుభవం గల 'x' Ray టెక్నీషియన్స్ & సిస్టర్స్ కావలెను. ఆకర్షణీయ జీతం ఇవ్వబడును. ఆసక్తి గలవారు బయోడేటాతో సంప్ర: జగిత్యాల రోడ్, KNR. Cell: 96185 96180.

లక్ష్మీ గార్మెంట్స్‌లో పనిచేయుటకు (Male) వర్కర్స్ కావలెను. అడ్రస్ ఆశోక్‌నగర్ KNR. Cell. 98660 30739.

జాబ్ ఆఫర్: Shara గ్రూప్ కంపనీకి కొత్త జిల్లాలో పర్మినెంట్ ఉద్యోగాలు. నో ఫీజు. ఫ్రీ రూం. అ: 10th ఆపైన, వ: 18 to 26 సం॥లోపు స్త్రీ/పు. సంప్ర: KNR. Cell: 86863 32214, 97012 67560.

ఫైనాన్స్ కంపెనీలో పనిచేయుటకు సీనియర్, జూనియర్ అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, డేటా ఎంట్రీ, కలక్షన్ బాయ్స్, సూపర్‌వైజర్స్ కావలెను. జీతం: 13 వేలు - 18 వేలు. రూం + మీల్స్ ఫ్రీ. Q: 10th to any P.G. బైక్ సౌకర్యం కలదు. M/F కావలెను. 7330380732/ 7097722976.

Wanted Freshers Earn 10,000 to 12000, Age 18 to 28 Yrs. Qly. Inter and above, Free accommodation. Cont. 8688866485.

ఆఫీస్ నందు పనిచేయుటకు లేడి రిసెప్షనిస్ట్/ టెలికాలర్స్ కావలెను. చదువుతో సంబంధం లేదు మంచి జీతం ఇవ్వబడును సంప్రదించండి. 91821 97876

MARKETING / SALES

Wanted Marketing Execuitves for a Reputed Photo Albums Printing Digital Press, Two Wheeler Must. Karimnagar, Jagithyala Candidates Prefferable ✆ 8977077736/ 9100235553.

J.S.R. గ్రూప్ సన్‌సిటీ యాదగిరిగుట్ట, వరంగల్ హైవేలో రియల్ ఎస్టేట్ మార్కెటింగ్‌కు టీమ్‌లీడర్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం+కమీషన్+ఇన్సెంటీవ్స్ ఇవ్వబడును. Ph: 7799893899

FACULTY / TEACHERS

Wanted Teachers to teach Pre/Primary and High School Physical Science. Fluency in English is must. Cont: SSV High School (GGP). Cell: 77299 88488, 76599 24513.

MEDICAL

హాస్పిటల్ నందు పనిచేయుటకు అనుభవం గల ICU నర్సులు, రిసెప్షనిస్ట్, వార్డుబాయ్స్, మెడికల్‌షాప్ బాయ్, ఆఫీస్ బాయ్ కావలెను. సంప్ర॥ పూర్ణలక్ష్మి న్యూరో సెంటర్, కోర్టుచౌరస్తా, కరీంనగర్. సెల్: 98492 09020.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.





సరదాగా కబడ్డీ ఆడుతున్న శ్రీనివాస్‌రెడ్డి



కోతిరాంపూర్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నాయకులు

ఉత్సాహంగా 'ఖేల్ భారత్' పోటీలు

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల సందర్భంగా భారతీయ జనతా యువ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎస్సారార్ కళాశాల క్రీడా మైదానంలో ఖేల్ భారత్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఉదయం జరిగిన పోటీలను భాజపా జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీలకు కబడ్డీ విభాగంలో 28 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, దేశీయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలను ప్రోత్సహించేందుకు యువ మోర్చా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా క్రీడా పోటీలు నిర్వహించి యువతను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇలాంటి వేదిక ద్వారా దేశంలోని 65 శాతం యువతీ యువకులను దేశీయ సమగ్ర, సమైక్యతకు పాటుపడేలా వారిలో దేశభక్తి, జాతీయ భావం పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. తక్కువ సమయంలోనే మంచి స్పందన రావడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన జట్లను రాష్ట్ర స్థాయికి పంపిస్తామని తెలిపారు. జాతీయ స్థాయిలో విజేతగా నిలిచే జట్లకు ప్రధాన మంత్రి బహుమతులను అందిస్తారని చెప్పారు. 28 జట్లు కబడ్డీ పోటీల్లో తలపడగా ఫైనల్‌లో శ్రీచైతన్య-కోతిరాంపూర్ జట్లు తలపడ్డాయి. శ్రీచైతన్యపై కోతిరాంపూర్ జట్టు 22-11 పాయింట్లతో విజేతగా నిలిచింది. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రాజేశ్ బహుమతులను అందజేశారు. వర్షం కారణంగా వాయిదా పడిన ఖోఖో పోటీలను త్వరలో ప్రకటిస్తామని యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొయిపపల్లి ప్రవీణ్‌రావు తెలిపారు. ఖేల్ భారత్ రాష్ట్ర కన్వీనర్ కోమల మహేశ్, భాజపా నగర అధ్యక్షుడు బేతి మహేందర్‌రెడ్డి, నాయకులు డి.సంపత్, కటకం లోకేశ్, రమణారెడ్డి, శ్రీనివాస్, రామరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి నీళ్లు సాధించే వరకు పోరాటం



పాదయాత్ర చేస్తున్న నాయకులు

కొడిమ్యాల, న్యూస్‌టుడే: మండలంలోని పోతారం జలాశయాన్ని ఎల్లంపల్లి నీటితో నింపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి మేడిపల్లి సత్యం అన్నారు. మండల కేంద్రంలోని పంపుహౌజ్ పనులు పూర్తిచేసి పోతారం జలాశయం, చెరువులు, కుంటలను ఎల్లంపల్లి నీటితో నింపాలని డిమాండ్ చేస్తు పోతారం ప్రాజెక్ట్ నుంచి జగిత్యాల వరకు అఖిలపక్షం ఆధ్వర్యంలో మహాపాదయాత్రను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఏడాదిగా ఎల్లంపెల్లి నీటికోసం పోరాడుతుంటే దాన్ని అధికార పార్టీ నాయకులు వక్రీకరించడం సరికాదన్నారు. పార్టీలకు అతీతంగా ఎల్లంపెల్లి నీటి సాధనే అజెండాగా ఉద్యమిస్తున్నామన్నారు. రాష్ట్రంలో కోటి, నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీళ్లిస్తామంటున్న ప్రభుత్వం 90శాతం పూర్తయిన పోతారానికి ఎందుకు నీళ్లివ్వడం లేదని, మిగిలిన పదిశాతం పని పూర్తికి ఇంకెన్నాళ్లు పడుతుందని, ఈ అంశంపై చర్చకు తాము సిద్ధమని సవాలు విసిరారు. నియోజకవర్గ కాంగ్రెస్, భాజపా ఇన్‌చార్జిలు దేవయ్య, లింగంపెల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి రైతులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని, కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రాజెక్ట్ పనుల్లో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రాజెక్ట్‌లు పూర్తిచేసి రెండు మండలాలకు నీరందించాలని లేనిపక్షంలో రైతులు, ప్రజలే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఐల్నేని సాగర్‌రావు, ఎం.రాజన్న, తెదేపా, కాంగ్రెస్, భాజపా, బీజేవైఎం మండలాధ్యక్షులు జి.నర్సయ్య, ఎ.రఘు, బి.గంగాధర్, లక్ష్మణ్, కేడీసీసీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, అఖిలపక్ష నాయకులు కరుణాచారి, శ్రీనివాస్‌చారి, దేవేందర్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎన్.సురేష్, ఎం.మల్లేశం, కె.రమేష్, చంద్రశేఖర్, రైతు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు 'మానేరు' కష్టాలు

నది ఉద్ధృతికి కొట్టుకుపోయిన పైపులు, మోటార్లు

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం అన్నదాతలకు కాస్త ఊరటనిచ్చింది. మండలంలోని ముత్తారం, పారుపల్లి, ఓడేడ్, అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి పరివాహక ప్రాంతంలో మానేరు నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇన్ని రోజులు నదిలో నీరు లేక మోటార్లు ఎత్తిపోతే.. ఈ రెండు రోజుల వర్షంతో నదీ ప్రవాహం పెరిగి, వేలాది వ్యవసాయ పైపులు, విద్యుత్తు మోటార్లు, పరికరాలు కొట్టుకుపోవడం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. నదిలో కొట్టుకుపోగా ఒడ్డుకు ఆగిన పైపులను కర్షకులు నానా తంటాలు పడి బయటకు తెచ్చుకున్నారు. అలాగే ముత్తారంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు వర్షం నీరు భారీగా నలిచింది.



ముత్తారం ఎమ్మార్వో కార్యాలయం ముందు నీరు..



నదిలో కొట్టుకుపోయిన పైపులను తెచ్చుకుంటున్న రైతులు

పూర్వ ప్రాథమిక విద్య.. అనుమతులు మిథ్య

నిబంధనలను విస్మరిస్తున్న పలు ప్రైవేటు పాఠశాలలు ● చర్యలకు వెనుకంజ వేస్తున్న విద్యాశాఖ

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యా విభాగం

పాఠశాలల విద్యారంగంలో రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు తీసుకొస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు నీరుగారుతోంది. అధికారుల ఉదాసీనత, పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ నిబంధనలు పలువురికి చుట్టపు చూపుగా మారుతున్నాయి. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య(ప్రీప్రైమరీ) తరగతుల నిర్వహణకు అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి జిల్లా విద్యాశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలన్న నిబంధలను రాష్ట్ర విద్యాశాఖ గతేడాదే అమలు చేసింది. లేదంటే, తరగతులు నిర్వహించవద్దని సూచించారు. జిల్లాలోని మొత్తం ప్రైవేటు పాఠశాలల్లో సగానికి పైగా పాఠశాలల్లో అనుమతి లేకుండా ఈ ఏడాది తరగతులు కొనసాగుతున్నా నియంత్రించడంలో జిల్లా విద్యాశాఖ విఫలమవుతోంది. జిల్లాలో మొత్తం 309 ప్రైవేటు పాఠశాలలుండగా 85,791 మంది విద్యార్థులు చదువుతున్నారు.

గతేడాది హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో లిఫ్ట్‌లో పడి చిన్నారి మృతి చెందడంతో ప్రైవేటు బడుల్లో చిన్నారులకు వసతుల కల్పనలో లోపాలున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ గుర్తించింది. వెంటనే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహించే ప్రీప్రైమరీ తరగతుల కోసం జిల్లా విద్యాశాఖ నుంచి అనుమతి తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ నిబంధనలను అమలు చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ నిబంధనలను అమలు చేయాలని ఇందుకోసం గత విద్యా సంవత్సరంలోనే వాటి అనుమతులకు అవకాశాన్ని అధికారులు కల్పించారు. గత మార్చి 10వ తేదీతో అనుమతులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ముగిసింది. జిల్లాలో మాత్రం వీటి అనుమతులు తీసుకోవాలన్న నిబంధనలకు తగినంత ప్రచారం కల్పించకపోవడం, అధికారుల చర్యల లోపంతో ఈ నిబంధనలు మొక్కుబడిగా మారుతున్నాయి.

135 బడులకే అనుమతి.

జిల్లాలోని మొత్తం 309 ప్రైవేటు పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు మొత్తం 148 పాఠశాలలే ప్రస్తుత విద్యా సంవత్సరానికి అనుమతులు తీసుకున్నాయి. 161 ప్రైవేటు పాఠశాలల్లో ఈ తరగతులు అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ వాటిని నియంత్రించే చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క కరీంనగర్‌లోనే 135 ప్రైవేటు పాఠశాలలుండగా, వాటిల్లో 78 పాఠశాలలు మాత్రమే అనుమతులు తీసుకున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఉన్న అన్ని బడుల్లో ప్రీప్రైమరీ తరగతులు జరుగుతుండగా, దాదాపు 4 నుంచి 5 వేల మంది బాలలు చదువుతున్నట్లు అంచనా. అనుమతి లేకుండా పెద్ద సంఖ్యలోని పాఠశాలల్లో ఈ తరగతులు జరుగుతున్నా వాటిని మూసివేసే చర్యలను ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరో వైపు ప్రతిపాదనలను సమర్పించి అనుమతులు తీసుకున్న ప్రైవేటు యాజమాన్యాలు ఈ విషయంలో ఆసంతృప్తిగా ఉంటున్నాయి. అనుమతులు తీసుకోని వారికి వాటిని పొందిన వారికి తేడాలేకుండా పోతోందని పలువురు యజమానుల్లో అసంతృప్తి నెలకొంటోంది. మరోవైపు చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాశాఖ వెనుకాడుతోంది. కనీసం ఇలాంటి తరగతులు ఎన్ని పాఠశాలల్లో కొనసాగుతున్నాయన్న వివరాలను కూడా ఇప్పటి వరకు ఆశాఖ సేకరించలేదంటే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఏంటో అర్థమవుతోంది. చర్యల కోసం నోటీసులు జారీ చేయాలని జిల్లా విద్యాధికారి ఇటీవల ఎంఈవోలకు సూచించినా మెజారిటీ మండలాల్లో ఎంఈవోలు నేటి వరకు జారీ చేయలేదు.



నోటీసులు జారీ చేయాలని సూచించాం..

-పి.రాజీవ్, డీఈవో, కరీంనగర్

జిల్లాలో ప్రీప్రైమరీ తరగతులకు అనుమతులు తీసుకోని ప్రైవేటు పాఠశాలలపై చర్యల కోసం నోటీసులు జారీ చేయాలని ఎంఈవోలకు సూచించాం. దరఖాస్తు చేసుకున్న 148 పాఠశాలలకు అనుమతులిచ్చాం. మరో 70 వరకు ప్రీప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలు ఉంటాయని అంచనా, వాటన్నింటికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకునేలా సమయాత్తమవుతున్నాం.

26న జిల్లా స్థాయి సబ్-జూనియర్ జూడో పోటీలు

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న సబ్-జూనియర్ విభాగంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాలకు ఉమ్మడిగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కడారు ఆనంతరెడ్డి, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 నుంచి అండర్-15 వయసు మధ్య క్రీడాకారులకు పోటీలు జరుగుతాయన్నారు. 2003 నుంచి 2005 మధ్య జన్మించి వారు పోటీలకు అర్హులన్నారు. 25 కేజీల నుంచి 55 కేజీల విభాగాల్లో బాలబాలికలకు వేరు వేరు పోటీలు జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపే క్రీడాకారులను సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డుతో 26న ఉదయం 11 గంటలకు కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో రిపోర్టు చేయాలని సూచించారు.

తీవ్ర అస్వస్థతతో వ్యక్తి మృతి

జమ్మికుంట గ్రామీణం : జమ్మికుంట మండలం కోరపల్లి పంచాయతీ పరిధిలోని గోవిందపూర్‌కు చెందిన బౌతు యాదగిరి(45) ఆదివారం పత్తికి క్రిమిసంహారక మందు పిచికారి చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరపల్లి గ్రామానికి చెందిన యాదగిరి ఆదివారం ఉదయం తన వ్యవసాయ భూమిలో పత్తికి క్రిమిసంహారక మందు పిచికారి చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు యాదగిరిని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.



మృతి చెందిన యాదగిరి

సీపీఎస్ రద్దు పోరాటానికి పీఆర్టీయూ మద్దతు

కరీంనగర్ విద్యా విభాగం : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు పరుస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు వచ్చే నెల 1 నుంచి చేపట్టే సామూహిక సెలవు పోరాటానికి తమ సంఘం పూర్తి మద్దతు తెలుపుతోందని పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాలి మహేందర్‌రెడ్డి, ముస్కు తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ విధానం అంతమయ్యే వరకు చేసే పోరాటానికి తమ సంఘం అండగా నిలుస్తుందని చెప్పారు. దీని రద్దుకు దేశవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను కలుపుకొని పోరాట కార్యాచరణను చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

మల్యాల(చందుర్తి): చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన గుంటి దేవయ్య(55) ఈ నెల 9న దుబాయ్‌లో గుండె పోటుతో మృతి చెందగా ఆదివారం అతని మృతదేహం స్వగ్రామం చేరింది. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన దేవయ్య గుండెపోటుతో మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య సరవ్వ, కుమారుడు ప్రవీణ్‌తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



దేవయ్య(పాతచిత్రం)

నాచుపల్లి(కొడిమ్యాల) : మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన రాయనవేని నర్సయ్య మృతదేహం ఆదివారం స్వగ్రామానికి చేరింది. నర్సయ్య ఉపాధి నిమిత్తం కొన్నేళ్లుగా గల్ఫ్ వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో గత 45 రోజుల కిందట గుండెపోటుతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని తీసుకురావడానికి నాయకులు, ప్రజాప్రతినిధులు కృషిచేయగా 45 రోజులకు స్వగ్రామం చేరింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. అనంతరం మృతదేహానికి అత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నర్సయ్య మృతదేహం

వృద్ధురాలి దారుణ హత్య

కొడిమ్యాల, న్యూస్‌టుడే: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి అనుబంధ గ్రామమైన దమ్మయ్యపేటకు చెందిన బొజ్జ రాజమల్లవ్వ (65)ను గుర్తుతెలియని దుండగులు దారుణంగా మెడ నరికి చంపిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. సీఐ కృపాకర్ తెలిపిన వివరాల మేరకు దమ్మయ్యపేటకు చెందిన రాజమల్లవ్వకు మల్లేశం, లక్ష్మినర్సయ్య అనే ఇద్దరు కుమారులు, లచ్చుమ్మ, శంకరమ్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరందరికీ వివాహాలయ్యాయి. కుమారులు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుండగా రాజమల్లవ్వ తన చిన్న కోడలు మల్లవ్వతో కలిసి ఉంటోంది. ఇరవై రోజుల కిందట చిన్న కోడలు మల్లవ్వ తన తల్లిగారి గ్రామం నాచుపల్లికి వెళ్లగా రాజమల్లవ్వ ఇంటి వద్ద ఒంటరిగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు రాజమల్లవ్వపై దాడిచేసి మెడ వద్ద నరికి హత్యచేసినట్లు తెలిపారు. తెల్లవారాక మనవడు, పెద్దకోడలు హేమలత మృతదేహాన్ని చూసి పెద్దఎత్తున కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై కిరణ్‌కుమార్, సీఐ కృపాకర్, డీఎస్పీ కరుణాకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ బృందం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతురాలి పెద్దకుమార్తె లచ్చుమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మంత్రాల నెపంతోనే హత్య జరిగి ఉండవచ్చని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాకర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వరకట్న వేధింపులకు మనస్థాపం చెంది ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వేములవాడ మండలం శాత్రాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన గుడిసె లింగయ్య, కనుకమ్మ దంపతుల కూతురు అశ్విని (26)కి అదే గ్రామానికి చెందిన కోలపురం రవికుమార్‌తో గతేడాది వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షలు ఇచ్చారు. కొంత కాలంగా రవికుమార్ అశ్వినిని అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో మనస్థాపం చెంది అశ్విని వివాహం రోజునే శనివారం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు గమనించి హుటాహుటిన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందింది. వేములవాడ డీఎస్పీ అవధాని చంద్రశేఖర్, పట్టణ సీఐ శ్రీనివాస్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షఫీ తెలిపారు.



మృతురాలు అశ్విని

అంతర్గాం : అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధి మర్రిపల్లికి చెందిన రాగుల మొండయ్య(55) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మొండయ్య పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో చేర్పించారు. సాయంత్రం చికిత్స పొందుతూ మరణించాడు. మొండయ్య బ్రాహ్మణపల్లి సమీపంలోని పంపుహౌజ్‌లో కూలీగా పని చేస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు అంతర్గాం హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు.



మృతి చెందిన మొండయ్య

ఒంటికి నిప్పంటించుకొని యువకుడు...

గోదావరిఖని : ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొని మతిస్థిమితం లేని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గోదావరిఖని కళ్యాణ్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం ప్రకారం మతిస్థిమితం లేక తిరిగే ఈగ కిశోర్(35) తెల్లవారుజామున కళ్యాణ్‌నగర్ సమీపంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా కాలిన గాయాలు కావడంతో అతడి కేకలు విని చుట్టుపక్కల వారు బయటకు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకునే సరికే పూర్తిగా కాలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్యాణ్‌నగర్‌కు చెందిన కిశోర్ కొంత కాలంగా మతిస్థిమిత లేకపోవడంతో ఇంటికి రాకుండా తిరుగుతుండేవాడు. వివాహం కాకపోవడంతో మనస్తాపానికి గురైన కిశోర్ ఇంటికి రాకుండా బయట తిరుగుతు మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న కిశోర్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



● ఐస్ స్కేటింగ్ పోటీల్లో ఖని చిచ్చరపిడుగు సత్తా

● పట్టుదలతో ఆడి ప్రతిభతో పతకాల పంట

ఆసక్తి... అంతర్జాతీయ కీర్తి



'మొదటి అడుగు ఎప్పుడూ కఠినంగానే ఉంటుంది.. మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుంది'. ఈ వ్యాఖ్యల స్ఫూర్తితోనే ఆ విద్యార్థి ముందుకెళ్లాడు.. అంతవరకూ ఆటను ఎపుడూ చూడలేదు.. పొరుగింటి బాలుడిని చూసి ఆసక్తి పెంచుకొన్నాడు.. ఎవరి వద్దా శిక్షణ పొందకుండానే సొంతంగా సాధన చేశాడు.. నేరుగా బరిలోకి దిగిన మొదటిసారే రెండో స్థానంలో నిలిచాడు.. ఆ తర్వాత క్రమం తప్పని సాధనతో 'ఇంతింతై వటుడింతై' అన్న చందాన అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

-న్యూస్‌టుడే, మార్కండేయకాలనీ

గోదావరిఖనికి చెందిన తోటపెల్లి వెంకటస్వామి, వజ్ర దంపతుల కొడుకు తరుణ్‌కిశోర్ ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. వెంకటస్వామి సింగరేణి ఉద్యోగి. 2014లో తరుణ్‌కిశోర్ ఆరో తరగతి చదువుతుండగా పొరుగింటిలో ఉండే ఓ బాలుడు ఇంటి వద్ద స్కేటింగ్ చేస్తుండగా చూశాడు. ఆ క్రీడపై ఆసక్తి పెంచుకుని, స్కేటింగ్ పాదరక్షలు కొనివ్వమని తండ్రిని అడిగాడు. ఆ తర్వాత వాటిని ధరించి ఇంట్లో నిత్యం సాధన చేసేవాడు. అదే ఏడాది రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. మైదానానికి వెళ్లి, రూ.30 ప్రవేశ రుసుం చెల్లించాడు. శిక్షకులు లేని వారిని తీసుకోబోమని నిర్వాహకులు చెబితే ఒక్క అవకాశం ఇవ్వమని తరుణ్‌కిశోర్ ప్రాధేయపడ్డాడు. దీంతో అతడిని పోటీలకు అనుమతించారు. తర్వాత మిగతా పిల్లలను వెనక్కి నెట్టి తరుణ్ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. తరుణ్‌కిశోర్ ప్రతిభను గుర్తించిన శిక్షకులు ఆటలో అతడికి మెలకువలు నేర్పడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా

శిక్షకుల మార్గదర్శకత్వంలో రోలర్ స్కేటింగ్‌లో నైపుణ్యం సాధించిన తరుణ్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభతో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడు. అలాగే రోల్‌బాల్ విభాగంలో వరంగల్ వాగ్దేవి జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. మరోసారి వరంగల్‌లోనే నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి కెప్టెన్‌షిప్‌గా జ్ఞాపికను అందుకున్నాడు. గుజరాత్‌లోని సూరత్, బిహార్‌లోని పాట్నా, పుణెలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు. ఇటీవల ఆగస్టు 15న దిల్లీలోని ఆమ్లెన్స్‌మాల్‌లో నిర్వహించిన ఐస్ స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తరుణ్‌కిశోర్ వెండి పతకం పొందాడు. డిసెంబరులో మలేషియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

సన్నద్ధతకు అదనపు సమయం

స్కేటింగ్ పోటీల్లో రోలర్‌స్కేటింగ్, రోల్‌బాల్, రోలర్‌హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కేటింగ్ హాకీ విభాగాలుంటాయి. ఇందులో తరుణ్‌కిశోర్ రోలర్ స్కేటింగ్, రోల్‌బాల్, ఐస్ స్కేటింగ్ 300 మీటర్ల విభాగాన్ని ఎంచుకున్నాడు. దిల్లీలో జాతీయ స్థాయి పోటీలకు ముందు మూడు రోజుల పాటు శిక్షకులు రెండు గంటల పాటు ఐస్ స్కేటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అదనంగా ఒక గంట శిక్షణ కావాలంటే రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. తరుణ్‌కిశోర్ ఆ మొత్తం చెల్లించి, శిక్షకుల వద్ద మెలకువలు నేర్చి సన్నద్ధమయ్యాడు. మూడు రోజుల శిక్షణ అనంతరం పోటీలు నిర్వహించారు. ఇందులో 25 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కో విభాగానికి అయిదుగురు చొప్పున అయిదు విభాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు చొప్పున పది మందిని ఎంపిక చేశారు. క్వార్టరు ఫైనల్‌లో రెండు విభాగాలకు పోటీలు నిర్వహించి నలుగురిని ఎంపిక చేశారు. తుది పోటీల్లో ముగ్గురిని ఎంపిక చేయగా అందులో తరుణ్‌కిశోర్ ద్వితీయ స్థానం సాధించాడు.

వారిని చూసి పట్టుదల పెరిగింది: తరుణ్‌కిశోర్

విశ్వవిద్యాలయం(యూనివర్సిటీ) పరిధిలో జరిగే ఐస్ స్కేటింగ్ పోటీల్లో రాణించాలన్నదే నా లక్ష్యం. 300 మీటర్ల ఐస్ స్కేటింగ్ విభాగాన్ని ఎంచుకున్నా. జాతీయ స్థాయి పోటీల్లో ఇతర రాష్ట్రాల అభ్యర్థులను చూసి నాలో మరింత కసి పెరిగింది. ఆ పట్టుదలనే నా విజయానికి కారణమైంది.

చదువుల కోవెల.. నైపుణ్య కళ

● పాఠశాల దశలోనే స్వయం ఉపాధికి పునాది

● ఆదర్శ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సుల బోధన

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించాలన్న ప్రభుత్వ సంకల్పం నెరవేరుతోంది. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన వృత్తి విద్యా కోర్సులు సత్ఫలితాలిస్తున్నాయి. విద్యార్థులకు చదువుతో పాటు భవిష్యత్తులో స్వయం ఉపాధి రంగంలో నిలదొక్కుకోవడానికి పునాదులు పడుతున్నాయి.

–న్యూస్‌టుడే, ధర్మారం

విద్యార్థులకు చదువుతోపాటు భవిష్యత్తుకు బాటలు వేయాలన్న లక్ష్యంతో ఆదర్శ పాఠశాలల్లో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టాలని 2015లో పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్సులను ఎంపిక చేసే బాధ్యతను నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్ఎస్‌డీసీ)కు అప్పగించింది. ఎన్ఎస్‌డీసీ ఎంపిక చేసిన కోర్సులతో ప్రయోగాత్మకంగా 2015-16లో రాష్ట్ర వ్యాప్తంగా 20 పాఠశాలలల్లో ప్రయోగాత్మకంగా కోర్సులు ప్రారంభించారు. కోర్సుల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపడంతో 2016-17లో 100 పాఠశాలలకు విస్తరించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి తెలంగాణలోని మొత్తం 120 ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. ఉమ్మడి జిల్లాలో 2015లో కేవలం గర్రెపల్లి, తిమ్మాపూర్, గన్నుకుల, ముల్కనూరు ఆదర్శ పాఠశాలల్లో మాత్రమే కోర్సులు ప్రారంభం కాగా ఈ ఏడాది అన్ని బడుల్లో మొదలయ్యాయి. వృత్తివిద్యా కోర్సులు చదివిన విద్యావంతులను పొరుగుసేవల పద్ధతిలో ఒక్కో పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించారు.

పాఠశాలలో రెండు కోర్సులు

ఐటీ అండ్ రిటేల్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, మల్టీమీడియా, ఫ్యాషన్ డిజైనింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫుడ్ ఫర్నిచర్, అగ్రికల్చర్, ఎలక్ట్రీషియన్, యానిమేషన్ తదితర కోర్సులను ఎన్ఎస్‌డీసీ ఎంపిక చేసింది. అయితే ఒక్కో పాఠశాలలో రెండు కోర్సులు మాత్రమే నిర్వహిస్తున్నారు. అక్కడి విద్యార్థుల ఆసక్తి, భౌగోళిక అంశాల ఆధారంగా ఎంపిక చేసుకునే వెసులుబాటును పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీలకే వదిలేసింది. ఈ ప్రాతిపదికన పాఠశాలల నుంచి ఎంపిక చేసుకున్న కోర్సుల ఉపాధ్యాయులను పొరుగుసేవల ద్వారా నియమించింది. కోర్సు కాలపరిమితి నాలుగేళ్లు కాగా, తొమ్మిదో తరగతిలో మొదలై ఇంటరుతో ముగుస్తుంది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు యోగ్యతా పత్రాలు అందిస్తారు. ఈ పత్రాలతో ప్రభుత్వం భర్తీ చేసే వృత్తివిద్య కొలువుల్లోనూ చేరవచ్చు.





కుట్లు, అల్లికలు నేర్చుకుంటున్న బాలికలు

కాగితాలతో విద్యార్థులు తయారుచేసిన గృహాలంకరణ వస్తువులు



చురుకుదనం పెరిగేందుకు ఆటల్లో సాధన చేస్తున్న బాలురు

సమగ్రంగా నేర్పిస్తున్నాం

దీపిక, ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షకురాలు



సంప్రదాయ దుస్తులు, ఆధునాతన, పాత తరం డిజైన్లపై అవగాహన కల్పిస్తున్నాం. పత్తి నుంచి దారం, బట్టల తయారీ, దుస్తుల డిజైన్లపై సమగ్రంగా నేర్పిస్తున్నాం. ఎవరికి ఎలాంటి డిజైన్లు నప్పుతాయో నేర్పిస్తున్నాం. కాగితాలు, ఇతర వ్యర్థాలతో గృహాలంకరణ సామగ్రి, బొకేలు, ఇతర వస్తువుల తయారీపై శిక్షణ ఇస్తున్నాం. ఇందుకు అవసరమైన సామగ్రి ప్రభుత్వం అందిస్తోంది. విద్యార్థులు మా పీరియడ్ కోసం ఎదురుచూస్తుంటారు.

ఆశించిన ఫలితాలు వస్తున్నాయి

డి.వెంకటేశ్వర్‌రావు, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి



చదువుతో పాటు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కోర్సులను ప్రారంభించింది. పిల్లలు ఆసక్తిగా నేర్చుకుంటుండటంతో ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. నైపుణ్యాలను మెరుగుపరచుకుంటున్నారు. భవిష్యత్తులో స్వయం ఉపాధి పొందడానికి ఈ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి. రాష్ట్రంలోని అన్ని ఆదర్శ పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమం అమలవుతోంది.

ఆత్మవిశ్వాసం పెరిగింది

ఆకుల స్వాతి, పదో తరగతి, ఖిలావనపర్తి



గతేడాది మా బడిలో ఫ్యాషన్ డిజైనింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు మొదలయ్యాయి. మొదటి సంవత్సరం పూర్తి చేశాను. కాడాకుట్టు, రోజ్ కుట్టు, బులియన్ ఆర్ట్, స్టెమ్స్ స్టిచ్, గొలుసుకుట్టు అన్నీ నేర్చుకున్నాను. ఈ సంవత్సరం కుట్టుమిషను నేర్పిస్తారు. వ్యర్థాలు కాగితాలతో గృహాలంకరణ సామగ్రి తయారీ నేర్పిస్తున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ ద్వారా ఆరోగ్యం, శారీరక ధర్మాల గురించి సవివరంగా తెలుసుకుంటున్నాం. ఇంటర్ తర్వాత చదువు ఆగిపోయినా మేం సొంతంగా ఫ్యాషన్ డిజైనింగ్ ద్వారా ఉపాధి పొందగలనన్న ఆత్మవిశ్వాసం పెరిగింది.

మానసిక ఒత్తిడి దూరం

కె.మైత్రి, పదో తరగతి, దొంగతుర్తి



ప్రతి రోజు ఒక పీరియడ్‌లో వృత్తి విద్యా కోర్సులు బోధిస్తున్నారు. మిగతా సబ్జెక్టులతో మానసికంగా ఒత్తిడికి గురవుతుంటాం. ఈ పీరియడ్‌లో మాత్రం ఆ ఒత్తిడిని మరచిపోతున్నాం. వివిధ రకాల ఆటలు ఆడే పద్ధతులు, ఈ కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు, శారీరక ధర్మాలు, యోగా, వివిధ రుగ్మతలకు కారణాలను వివరిస్తున్నారు. మారుతున్న కాలంలో పాత, కొత్త తరం దుస్తుల డిజైన్లపై అవగాహన కల్పిస్తున్నారు. అందుకే ఆసక్తి పెరిగింది.

విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు: సంజీవరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ శిక్షకుడు



శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసిక ప్రశాంతత ఉంటుంది. వివిధ రకాల ఆటల్లో మెలకువలు నేర్పిస్తున్నాం. ఏడాదికి మూడు సార్లు క్షేత్ర పర్యటనలకూ తీసుకెళ్తున్నాం. పిల్లల్లో చురుకుదనం పెరిగేందుకు కసరత్తులు చేయిస్తున్నాం. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఈ కోర్సు దోహదం చేస్తుంది. విద్యార్థుల అభిరుచులకు తగ్గట్టుగా ఆటలు ఆడిస్తున్నాం. కసరత్తులు చేయిస్తున్నాం. తద్వారా విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తున్నారు.

వనం.. జనం.. చేతనం

● మొక్కల పెంపకంలో సింగరేణి ఆదర్శం

● ఆర్జీ-1 విభాగానికి హరితమిత్ర పురస్కారం



ఏపుగా పెరిగిన చెట్లు

న్యూస్‌టుడే, గోదావరిఖని: అడవుల పెంపకం.. ఏటికేడు సింగరేణి ప్రతిష్ఠను పెంచుతోంది. మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న ఆర్జీ-1 ప్రాంతానికి ఈ ఏడాది అరుదైన గుర్తింపు దక్కింది. ఈ సంవత్సరం హరితమిత్ర అవార్డు వరించింది.

2016లో మొక్కలు నాటే కార్యక్రమంలో సింగరేణి అందరినీ భాగస్వాములను చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు చేపట్టింది. విద్యార్థులను, కార్మిక కుటుంబాలను మొక్కలు నాటే దిశగా ప్రోత్సహించింది. ఫలితంగా ఆర్జీ-1 ప్రాంతంలో 9 లక్షల మొక్కలు నాటగలిగారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పథకం ఆరంభించడానికి ముందే సింగరేణి ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతోంది. ఏటా గనులు, పరిసర ప్రాంతాల్లో వేలాది మొక్కలు నాటుతోంది. సింగరేణి వ్యాప్తంగా హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా ఆర్జీ-1 ప్రాంతంలో ఇస్తున్న ప్రాధాన్యానికి మరింత గుర్తింపు దక్కింది. గతేడాది ఒకే రోజు లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టింది. భారీ ప్రదర్శన నిర్వహించడంతో పాటు విద్యార్థులు, యువకులు, స్వచ్ఛంద సంఘాలు, మహిళా సంఘాల సభ్యులను ఇందులో భాగస్వాములను చేసింది. ప్రధానంగా సింగరేణి సేవా సమితి మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. హరితహారం స్ఫూర్తితో ఇళ్ల వద్ద గృహిణులు మొక్కల పెంపకంపై దృష్టి సారించేలా అవగాహన కల్పించారు. సింగరేణి కృషికి గుర్తింపుగా ఈ ఏడాది ప్రభుత్వం హరితమిత్ర అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి ఆర్జీ-1 జీఎం విజయ్‌పాల్‌రెడ్డి ఈ పురస్కారం అందుకున్నారు.

ఈ ఏడాది 80 శాతం పూర్తి

అవార్డు స్ఫూర్తితో ఆర్జీ-1 ఈ ఏడాది 4.30 లక్షల మొక్కలను నాటే కార్యక్రమంలో నిమగ్నమైంది. 106 హెక్టార్లలో మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టగా ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తి చేసింది. మొక్కల పెంపకంపై స్ఫూర్తి కల్పించేందుకు అవగాహన ర్యాలీలు నిర్వహించడం, కాలనీ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఈ ప్రాంతంలో అడవుల ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లగలిగారు.



సీఎం కేసీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న జీఎం విజయ్‌పాల్‌రెడ్డి



వరి నాటు కోసం పొలాన్ని దమ్ము చేస్తున్న మదారబీ

ఆత్మవిశ్వాసమే ఆమె బలం

● పదెకరాల్లో సొంతంగా వ్యవసాయం

● ఏడు పదుల వయసులోనూ అలుపెరగని కష్టజీవి

ఏడు పదుల వయసులోనూ ఆమె అలుపెరగకుండా పొలం పనులు చేస్తారు.. మహిళా సమస్యలపై పాలకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటారు.. చిన్ననాటి గాయాలను లెక్క చేయకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్నారు..పొలం పనుల్లో ఇతరుల సాయం కోసం ఎదురుచూడకుండా సొంతంగా రాణిస్తున్నారు.. మగవాళ్లు చేసే పనులనూ అవలీలగా చేస్తూ ఔరా అనిపిస్తున్నారు.. –న్యూస్‌టుడే, ధర్మపురి

ధర్మపురి మండలం తీగలధర్మారం గ్రామానికి చెందిన ఎండీ మదారబీకి తొమ్మిదేళ్ల వయసులోనే ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అంకూస్‌తో వివాహం జరిగింది. అప్పటికి ఆయన వయసు 22 ఏళ్లు. చిన్నతనంలోనే పెళ్లి చేయడంతో మదారబీ అత్తింట్లో ఇమడలేకపోయారు. ఎందుకంటే చిన్ననాటి నుంచి ఆమెది ప్రశ్నించే మనస్తత్వం. దీంతో పెళ్లయిన కొన్నాళ్లకే స్వగ్రామానికి వచ్చారు. మళ్లీ పెళ్లి చేసుకోకుండా కన్నవారి చెంతనే ఉన్నారు. తమ్ముడు చిన్నవాడు కావడంతో వ్యవసాయ పనులు చేస్తూ వారికి ఆసరాగా నిలిచారు. వృద్ధులైన తల్లిదండ్రులకు బాసటగా నిలిచి, తమ్ముడిని పెంచి పెద్ద చేశారు. సోదరుడికి యుక్త వయసు వచ్చాక ఉపాధి కోసం సౌదీకి వెళ్లిన తర్వాత మదారబీ ఇక్కడి వ్యవసాయ క్షేత్రాలన్నీ తానై చూసుకుంటున్నారు.


ఆధునిక సాగు పద్ధతుల్లో ఆదర్శం

మదారబీ మొత్తం 10 ఎకరాల పొలాలను స్వయంగా సాగు చేస్తున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంపై పూర్తిగా అవగాహన పెంచుకున్నారు. ఆధునిక సాగు పద్ధతులపై ఆకళింపు చేసుకున్నారు. 30 ఏళ్లుగా ఆమె ఏనాడూ వ్యవసాయంలో ఇతరులపై ఆధారపడలేదు.

వ్యవసాయ పనులకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్నారు. సామాజిక పింఛన్లు, ప్రభుత్వ పథకాలతో లబ్ధి, స్వశక్తి సంఘాల రుణాల చెల్లింపులో చుట్టుపక్కల వారికి చేదోడు వాదోడుగా ఉంటున్నారు. మూడు సార్లు వార్డు సభ్యురాలిగా పని చేశారు. ఏడు పదుల వయసులోనూ వృద్ధాప్యాన్ని దరి చేరనీయకుండా మహిళల్లో చైతన్యానికి ఆమె స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చుట్టుపక్కల ఎవరైనా పేదలు మృతి చెందితే బాధిత కుటుంబాలకు బియ్యాన్ని, నగదు వితరణ చేయడం అలవాటుగా మార్చుకున్నారు.



పొలం పనుల్లో మదారబీ



అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే గణపతి నవరాత్రి ఉత్సవాలు మరో నాలుగు రోజుల్లో మొదలు కానున్నాయి. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను నింపడంతో పాటు ఐక్యత చేకూర్చేందుకు నాడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ఉత్సవాలు ప్రారంభించారు. ఏ లక్ష్యంతో ఉత్సవాలు మొదలయ్యాయో అదే భక్తి భావంతో నిర్వహించుకోవడం ఉత్తమమైన మార్గం. ఉత్సవాల్లో అత్యుత్సాహం ప్రదర్శిస్తే ఇతరులకు ఇబ్బందులు తప్పవు. జల, శబ్ద కాలుష్యాలు పెంచకుండా వేడుకలు జరుపుకుంటేనే సమాజ హితం కోరినవారమవుతాం.

ఆది దైవం.. భక్తి భావం

● మండపాల నిర్వహణ ఆదర్శం కావాలి

● వినాయక ఉత్సవాలలో విచక్షణే కీలకం

న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ప్రజల్లో ఐక్యతను చాటుకునేందుకు మొదలైన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో అత్యుత్సాహం, అనైక్యత పలు సమస్యలకు దారి తీస్తుంది. గతంలో ఒక ఊరిలో ఒకే చోట భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకునేవారు. క్రమక్రమంగా అది వాడవాడకూ మారింది. పది మంది కలిస్తే చాలు అక్కడో గణపతి విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. దీంతో ఒకే రోడ్డులో దగ్గర దగ్గరగా నాలుగైదు మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కాలుష్యం పెరగడంతో పాటు డబ్బు వృథా అవుతుంది. కనీసం ఓ కాలనీకి చెందిన వారైనా ఒకే చోట జరుపుకుంటే ఆయా మండపాలు భక్తులతో సందడిగా ఉంటాయి. ప్రత్యేక పూజలు నిర్వహించుకోవచ్చు.

రహదారులను ఆక్రమిస్తే ఎలా?

రామగుండం నగరంలో అసలే ఇరుకు రోడ్లు. అందులో ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు మాత్రమే కొంత స్థలం వదిలి మొత్తం రోడ్డంతా మండపం నిర్మిస్తారు. పలుచోట్ల ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు సైతం దారి ఉండదు. ఇలాంటప్పుడు ఉత్సవాలపై ఉన్న విశ్వాసంతో ప్రజలు అడ్డు చెప్పకపోవచ్చు. వెళ్లేందుకు దారిలేక తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. ఏదైనా అనారోగ్యంతో బాధ పడే వారిని అత్యవసరంగా ఆసుపత్రికి తరలించాలంటే ఇలాంటి అడ్డంకులతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఇక అన్నదాన కార్యక్రమాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించేటప్పుడు నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులను పూర్తిగా మూసేస్తుంటారు. దీంతో అటుగా వెళ్లేవారి ఇబ్బందులను సైతం దృష్టిలో పెట్టుకోవాల్సి ఉంది.



ఒకే వీధిలో దగ్గర దగ్గరగా వినాయక మండపాలు(పాత చిత్రం)



మట్టి విగ్రహాలు నిమజ్జనం చేసిన కొద్ది సేపట్లోనే ఇలా కరిగిపోతాయి(పాత చిత్రం)

భక్తి భావం పల్లవించాలి

ఉత్సవాల్లో పలువురు భక్తులు పోగై భజనలు చేయడం ఆధ్యాత్మికతలో అత్యుత్తమమైన మార్గం. కాదంటే ఆధ్యాత్మిక గీతాలు, ప్రవచనాలతో మండపాల్లో భక్తిపూర్వక వాతావరణాన్ని నెలకొల్పుకోవచ్చు. అలా కాకుండా సినిమాల్లో క్లబ్బు డ్యాన్సులకు సంబంధించిన పాటలకు పేరడీగా భక్తిపాటలను ఆలపిస్తే సినిమాల్లోని భావమే స్ఫురిస్తుంది తప్ప భక్తిభావం కలగదు. భజనలు చేయడం వీలు కాకపోతే మండపాల్లో ప్రశాంతత నెలకొల్పాలి. మైకుల శబ్దాలు మండపాల ప్రాంగణం వరకైతే ఫర్వాలేదు. అలా కాకుండా కాలనీ అంతా గగ్గోలు పెట్టేలా లౌడ్‌స్పీకర్లు, డీజేలు ఏర్పాటు చేస్తూ రణగొణ ధ్వనులు పెంచడం సరికాదు. బలవంతంగా చందాలు వసూలు చేసి మండపాల్లో ఆర్భాటాలు అవసరమా... నిమజ్జన ఊరేగింపుల్లో మద్యం తాగి నృత్యం చేసే యువత ఒక్క సారి ఆలోచించండి. మద్యం మత్తులో వినాయక నిమజ్జనానికి వెళ్లినవారు నదుల్లో, చెరువుల్లో మునిగి మృత్యువాతపడుతున్న సంఘటనలు ఏటా వింటూనే ఉన్నాం. నవరాత్రులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచిన గణపతిని మద్యం నృత్యాలతో సాగనంపడం సబబేనా...

పవిత్రం.. అపహాస్యం కావద్దు!

అత్యంత భక్తి శ్రద్ధలతో కొలిచే వినాయక ప్రతిమలను గబ్బర్‌సింగ్, బాహుబలి, బుల్లెట్ గణపతి అంటూ చిత్రవిచిత్రమైన రూపాల్లో గణపతి విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ఆయా కాలనీల్లోని పెద్దలు, ఆధ్యాత్మికవేత్తలు దీనిని నిరోధించాల్సి ఉంది. అత్యంత పవిత్రమైన దేవుడిని తమకు నచ్చిన రూపాల్లో పెట్టుకొని కొలుచుకోవడం అపహాస్యం చేసినట్లు కాదా! నాడు పార్వతి దేవి నలుగుపిండితో గణపతిని తయారు చేస్తే ఇప్పుడు కాలుష్యకారకమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలను తయారు చేసి కొలుస్తున్నారు. మట్టి గణపతికి పూజలు సర్వత్రా శ్రేయస్కరమైనవని వివిధ వర్గాలు చెబుతున్నప్పటికీ అవేవీ పట్టించుకోకుండా పోటీ పడి ఎత్తయిన విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ఎంత పెద్ద విగ్రహం పెట్టామన్న దానికన్నా ఎంత నిష్ఠతో పూజలు చేశామన్నదే ప్రధానం. నిమజ్జనం చేశాక మట్టి విగ్రహాలు వెంటనే కరిగి కలిసిపోతుండగా, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు సంవత్సరాల తరబడి అలాగే ఉంటూ కాలుష్యాన్ని పెంచుతాయి. దీంతో జలచరాలు మృత్యువాత పడుతాయి. భూసారం తగ్గుతుంది.

'ట్రిపుల్'.. ప్రతిభ

● కల నిజం చేసుకున్న సర్కారు విద్యార్థులు



ఎస్సెస్సీలో ఉత్తమ గ్రేడ్‌లు సాధించి మంత్రి ఈటలచే సత్కారాన్ని అందుకుంటున్న విద్యార్థులు

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యా విభాగం

అందరిదీ గ్రామీణ నేపథ్యమే.. చదివిందీ సర్కారు బడే.. కాని వారి లక్ష్యం మాత్రం ఉత్తమ ఫలితాలు.. అనుకున్నట్లుగానే ఉత్తమ ఫలితాలను సాధించిన సదరు విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలను పొందారు. జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన గ్రామీణ ప్రాంతాల్లోని పలువురు విద్యార్థులు గతేడాది పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ గ్రేడులను సాధించి, బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం పొందారు. అయితే ఏర్పరచుకున్న లక్ష్యంతో విద్యాసంవత్సరం పొడవునా టీవీలు, చరవాణిలను పక్కనపెట్టి, చదువు మీదనే ధ్యాస పెట్టి పక్కా ప్రణాళికతో ముందుకుసాగారు. ఉపాధ్యాయులు బోధించిన అంశాలను ఆకళింపు చేసుకొంటూ.. వాటిపై పట్టుసాధించి ఫలితంగా ఉత్తమ గ్రేడులను సాధించారు. ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి కన్నవారు గర్వించేలా, వారి కలలను నిజం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ఆదర్శ పాఠశాలల్లో చదివి ఎస్సెస్సీలో 10, 9.8 గ్రేడులను సాధించి, బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలను పొందిన విద్యార్థులు 'న్యూస్‌టుడే'తో వెలిబుచ్చిన అభిప్రాయాలు వారి మాటల్లోనే..

చదువుల్లో కల నెరవేరింది



-సొల్లు ఉషశ్రీ, హుజూరాబాద్

జడ్పీ పాఠశాలలో చదివిన నేను.. ఎస్సెస్సీలో 10 జీపీఏ సాధించాను. సాధారణ కుటుంబం కావడంతో పేరుగాంచిన కళాశాలల్లో చదవాలన్న కోరిక నెరవేరుతుందో లేదోనన్న నిరాశ ఉండేది. ప్రతిభకు తగినట్టుగా ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో కల నెరవేరింది. ఎస్సెస్సీలో ఉత్తమ గ్రేడు కోసం పాఠ్యాంశాలను నిత్యం చదవడం, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను అర్థం చేసుకొని, వాటిపైనే పూర్తి ధ్యాస నిలిపాను. దీంతో ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాశాను. ఫిజిక్స్ ప్రశ్నపత్రం కొంత భయపెట్టినా నిరాశ చెందకుండా సమర్థంగా రాశాను.

టీవీ, చరవాణిలకు ఏడాది దూరం



-మ్యాక అఖిల, హిమ్మత్‌నగర్(వీణవంక మండలం)

ఆదర్శ పాఠశాలలో చదివి ఎస్సెస్సీలో 9.8 జీపీఏతో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాను. వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను ఇందుకోసం దాదాపు ఏడాది పాటు టీవీ, చరవాణిల జోలికి వెళ్లలేదు. ట్రిపుల్ ఐటీలో సీటు లక్ష్యంగా పెట్టుకుని మొదటి నుంచి ప్రణాళికతో చదివాను. నిత్యం పాఠాలను పూర్తిగా చదవడంతో పాటు, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకొనేవాన్ని.. నిత్యం ఉదయం 5 గంటల నుంచి, సాయంత్రం 11 గంటల వరకు చదవడం ధ్యాసగా పెట్టుకున్నాను. ఏ రోజుకారోజు తరగతిలో చెప్పిన అంశాలను పూర్తి చేయడంతో పరీక్షలు కష్టమనిపించలేదు.

చదువే ధ్యాస



-నల్లగోని వినూష, ఎలబాక(వీణవంక మండలం)

ఆదర్శ పాఠశాలలో చదివి ఎస్సెస్సీలో 10 జీపీఏ పొంది, బాసర ట్రిపుట్ ఐటీలో సీటు సాధించాను. నేను 8వ తరగతిలో ఉండగా ఉపాధ్యాయులు ట్రిపుల్ ఐటీ గురించి చెప్పడంతో.. అందులో సీటు సాధించాలన్న లక్ష్యాన్ని ఏర్పరచుకొన్నాను. కూలీ పనులు చేసే అమ్మానాన్నలు ఎస్సెస్సీలో ఏనాడూ నా చదువులకు అంతరాయం కలిగించలేదు. ఒక ప్రణాళికా ప్రకారం నిత్యం చదవడమే ధ్యాసగా పెట్టుకొన్నాను. అయితే 10 జీపీఏను ఊహించకపోయినా దానికి సమీపంలో నిలవాలని ప్రయత్నించా.. కానీ ఫలితం ఆశ్చర్యపర్చింది, అనుకున్న సీటు వచ్చింది.

నాన్నకు ప్రేమతో..



-చరిత గుండేటి, లింగాపూర్(శంకపట్నం మండలం)

ఆదర్శ పాఠశాలలో చదివాను. ఎస్సెస్సీలో 10 జీపీఏను సాధించి ట్రిపుల్ ఐటీ సీటు సాధించాలన్న నాన్న కలను నిజం చేశాను. ఇందుకోసం ఏడాదిపాటు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవడంతో ఇది సాధ్యమైంది. ఏ రోజు, ఏ టైంలో ఏం చదవాలన్న ప్రణాళికను రూపొందించుకుని దానికి అనుగుణంగానే నిత్యం చదివాను. సందేహాలున్న అంశాలను మరుసటి రోజే నివృత్తి చేసుకోవడం అలవాటైంది. పాఠశాలలో నిర్వహించిన ప్రీఫైనల్ పరీక్షల ద్వారా పాఠ్యాంశాల్లో లోటుపాట్లను గుర్తించి, పునరావృతం కాకుండా జాగ్రత్తపడ్డాను. దీంతో ఏ ఒత్తిడి లేకుండా పరీక్షలు రాశాను. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నది నా లక్ష్యం.

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



-రాధారపు అరవింద్, గట్టుదుద్దేనపల్లి (మానకొండూర్ మండలం)

జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివాను. చదువులో ముందుండే తనను ఉపాధ్యాయులు గుర్తించి, 7వ తరగతిలోనే ట్రిపుల్‌ఐటీ గురించి చెప్పారు. బాగా చదివితే సీటు వస్తుందని చెప్పిన వారి మాటలు, అందించిన ప్రోత్సాహకం నిజంగానే సీటును సాధించేలా చేసింది. అయితే చదువుల్లో ముందున్నానని, ఎస్సెస్సీలో ఏనాడూ చదువులపై నిర్లక్ష్యం చేయలేదు. మరింత ప్రణాళికతో చదివా.. ఉదయం 4 గంటల నుంచే చదవడాన్ని దినచర్యగా పెట్టుకొన్నాను. ప్రభుత్వ బడిలో చదువుతున్నాని, ఏనాడూ నిరాశ చెందకుండా ఉపాధ్యాయులు చెప్పే అంశాలను పాటించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాను.

ఇంజినీర్ కావడమే లక్ష్యంగా



-ముజాహిద్, కేశవపట్నం

బాల్యం నుంచే ఇంజినీర్ కావాలన్న లక్ష్యం అనుకోకుండానే నాలో బలపడింది. ఏ పాఠశాలలోనైనా బాగా చదివితేనే నీ లక్ష్యం నెరవేరుతుందని అమ్మానాన్నలు చెప్పేవారు. . ఆదర్శ పాఠశాలలో సీటు పొందాక అదే పట్టుదలతో చదివాను. ఏ రోజు కూడా సమయాన్ని వృథా కానివ్వలేదు. పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకొని సృజనాత్మకంగా రాయాలన్న దాన్ని నిత్యం సాధన చేయగా, ఉపాధ్యాయులు ప్రోత్సహించారు. ఎస్సెస్సీలో 10 జీపీఏను సాధించినా, ట్రిపుల్ ఐటీలో సీటు వస్తుందని ఊహించలేదు. లక్ష్యానికి అనుగుణంగా అందులో సీటు రావడం.. మరింతగా చదవాలన్న ఆసక్తిని రెట్టింపు చేసింది.

ఉపాధికి సోపానం సార్వత్రిక సీబీసీఎస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజేందర్‌రెడ్డి

కరీంనగర్ (గణేశ్ నగర్), న్యూస్‌టుడే : పాఠ్య ప్రణాళిక భారం తగ్గించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సీబీసీఎస్ ఈ విద్యా సంవత్సరం నుంచి అమలవుతోందని ప్రాంతీయ సమన్వయ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ ఇ. రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సారార్ కళాశాల ఆవరణలో ప్రాంతీయ సమన్వయ కేంద్రంలో కౌన్సిలర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 2017-18 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు తీసుకునే విద్యార్థులు సీబీసీఎస్ కింద సబ్జెక్టులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. గతానికి భిన్నంగా బీఏ, బీకాం, బీఎస్సీ సబ్జెక్టులను తొలి ఏడాదిలోనే ఎంచుకోవాలన్నారు. విద్యార్థుల ప్రయోజనాలు, గరిష్ఠ లబ్ధి కోసం సెమిస్టర్ విధానం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఏడాదికి ఒక సారి కాకుండా ఆరు నెలలకోసారి సెమిస్టర్ పద్ధతిలో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. దీంతో పాఠ్యప్రణాళికను లోతుగా అధ్యయనం చేసే అవకాశం ఏర్పడుతుందన్నారు. సార్వత్రిక విద్యా విధానం బోధనలో సీబీసీఎస్ ప్రవేశపెట్టడంతో ఇతర డిగ్రీలకు తీసిపోని విధంగా విద్యా ప్రమాణాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. కౌన్సిలర్లు విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. డిగ్రీ, పీజీలో ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకై ఈనెల 24 వరకు అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు సహాయ కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

దిల్లీకి తరలిన భాకపా నాయకులు

భగత్‌నగర్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌ను కొనసాగించాలని కోరుతూ సోమవారం ధర్నా చౌక్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో దిల్లీలోని జంతర్‌మందర్ వద్ద చేపడుతున్న ధర్నాకు జిల్లా నుంచి భాకపా శ్రేణులు ఆదివారం తరలివెళ్లారు. ఈ మేరకు వెళ్లిన వారిలో భాకపా కరీంనగర్ జిల్లా కార్యదర్శి కె.రాంగోపాల్‌రెడ్డి, జగిత్యాల జిల్లా కార్యదర్శి బోయిని అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బొనగిరి మహేందర్, దుడ్డెల లక్ష్మినారాయణ, సర్పంచులు జయపాల్‌రెడ్డి, సిహెచ్ వేణు తదితరులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా తరహా ఉద్యోగోన్నతి కల్పించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: కోల్ ఇండియాలో అమలు చేస్తున్న మాదిరిగా జూనియర్ మైనింగ్ ఇంజినీరింగ్ శిక్షణార్థులకు ఉద్యోగోన్నతి కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు వి.సీతారామయ్య డిమాండ్ చేశారు. సింగరేణిలో పని చేస్తున్న జేఎంఈటీ శిక్షణార్థులకు నాలుగేళ్ల వరకు బి-గ్రేడు కల్పించకుండా వారితో సకల పనులు చేయించుకుంటున్నారని ఆయన తెలిపారు. గోదావరిఖని భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం జేఎంఈటీ శిక్షణార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాట్లాడారు. మైనింగ్ సర్టిఫికెట్ ద్వారా సాంకేతిక పరమైన ఉద్యోగానికి ఎంపికైన జేఎంఈటీలను జనరల్ మజ్దూర్ పనులు కూడా చేయిస్తున్నారని, కోల్‌కట్టర్ మాదిరిగా వారితో పేలుడు పదార్థాలు సరఫరా చేయిస్తున్నారని ఆరోపించారు. కేవలం రెండేళ్లకే బి-గ్రేడులో పదోన్నతి కల్పించాల్సిన యాజమాన్యం నాలుగేళ్ల వరకు అసలు ఏ పదోన్నతి రాకుండానే ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి కల్పించారని ఆరోపించారు. కోల్ ఇండియాలో ఏ విధంగా అమలవుతుందో అదే మాదిరిగా జేఎంఈటీలకు ఉద్యోగోన్నతి కల్పించాలని, లేని పక్షంలో యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఏఐటీయూసీ జేఎంఈటీ శిక్షణార్థులకు తమ సంఘం అండగా ఉంటుందని, తప్పకుండా యాజమాన్యంతో పోరాడి బి-గ్రేడు పదోన్నతులు కల్పిస్తామని వెల్లడించారు. సమావేశంలో నాయకులు వై.గట్టయ్య, ఎం.రంగయ్య, డి.శేషయ్య, వి.నారాయణ, మడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన గురుకుల పాఠశాలల్లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రజనీకాంత్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఆ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా గురుకుల పాఠశాలలను ప్రారంభించిందన్నారు. పాఠశాలలో కనీస మౌలిక సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా భోజనశాలలు లేవని, పడుకునే గదుల్లోనే భోజనం చేయాల్సి వస్తోందన్నారు. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించలేదన్నారు. దీంతో బోధన ముందుకుసాగడం లేదన్నారు. అపార్టుమెంట్లు, ఫంక్షన్‌హాలులు అద్దెకు తీసుకొని గురుకుల పాఠశాలలను ప్రారంభించారని, వీటిలో కనీస సౌకర్యాలు లేవన్నారు. ఆయన వెంట సంధ గణేశ్, సతీష్, విజేత, స్నేహ తదితరులు పాల్గొన్నారు.





వర్షానికి మత్తడి పోసిన మెట్‌పల్లి చెరువు; వంకాయగూడెంలోని యాపాలకుంట చెరువు

నీటి వనరులకు జలకళ



పొలంలోకి వస్తున్న వరద నీరు

శంకరపట్నం, న్యూస్‌టుడే: శంకరపట్నం మండల వ్యాప్తంగా రెండురోజులుగా భారీ వర్షం కురిసింది. శనివారం మండలంలో 35.3మిమీ వర్షం పడటంతో వరద నీరు చెరువులు, కుంటలలోకి చేరి జలకళ సంతరించుకుంది. మండలంలోని ఆముదాలపల్లి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మెట్‌పల్లి, వంకాయగూడెం యాపాలకుంట చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మెట్‌పల్లి చెరువు మత్తడి పోయగా మత్స్యకారులు ఉత్సాహంగా చేపల వేటకు దిగారు. గ్రామాల్లో వరదనీటితో పంట పొలాల్లోకి నీరు చేరింది. సకాలంలో వర్షాలు కురవక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వ్యవసాయానికి దోహదపడుతుందని గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

రామాజిపేటలో కానిస్టేబుల్‌పై వ్యక్తి దాడి



గాయపడ్డ కానిస్టేబుల్ అనిల్

రాయికల్, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరును పట్టుకునేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై దాడి చేసినందుకు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల గ్రామీణ సీఐ శ్రీనివాస్‌చౌదరి తెలిపారు. రాయికల్ మండలంలోని రామాజిపేట గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిఎస్.21.టి. 0549 నంబరు గల ట్రాక్టరులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు రాయికల్ ఠాణాకు చెందిన కానిస్టేబుల్ అనిల్ వెళ్లి అడ్డుకుని ఠాణాకు తరలిస్తుండగా ట్రాక్టరు యజమాని గోపాల్ వచ్చి కానిస్టేబుల్ అనిల్‌ను అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. అనిల్ విధులకు అడ్డగించడంతో పాటు దాడి చేయడంతో కానిస్టేబుల్ అనిల్ గాయాలపాలయ్యాడని కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గోపాల్ సైతం కానిస్టేబుల్ అనిల్ తనపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేశారని సమాచారం.

మట్టి గణపతికి.. జై!!

ఏటా అవగాహన కల్పిస్తున్న సంస్థలు



న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీవోపీ) వినాయక విగ్రహాలు పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయి. ఇది ఇప్పటికే శాస్త్రీయంగా నిరూపితమైంది. అయినా సమాజంలో ఎటువంటి మార్పు రావటం లేదు. ఏటా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలని, సమాజంలో పలు అవగాహన కార్యక్రమాలు కలిగించేందుకు కొన్ని సంస్థలు కృషి చేస్తున్నాయి. సంకల్ప బలం అందరిలో రావాలి, అప్పుడే సమాజం మొత్తం 'మట్టి గణపతి.. మన దళపతి'గా భావించి ముందుకు వస్తారు. అలాంటి మార్పు కోసం వివిధ స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషిని మరొకసారి అవలోకనం చేసుకుందాం.

చైతన్యమే లక్ష్యంగా..!

- తోట లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు, మానేరు పర్యావరణ సేవా సమితి



వాతావరణ, జల కాలుష్యంతో పాటు, పెరుగుతున్న ఉష్ణతాపాలపై తోట లక్ష్మణ్‌రావు పలు విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు చేపట్టారు. ఆరేళ్లుగా మట్టి వినాయకుల ప్రాధాన్యత కోసం పలు ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. వినాయక చవితికి ముందు గోడపత్రికలను ఆవిష్కరించి, పలు కాలనీలలో అంటించే కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పీవోపీ విగ్రహాలు జీవరాశి మనుగడకే ముప్పుగా భావించి ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఉత్సవ కమిటీలు ఈ దిశగా ఆలోచన చేయాలని పిలుపునిస్తున్నారు. ఈ ఏడాది 500 మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి కాలనీలో అందరికీ ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టబోతున్నారు. పర్యావరణ హితం, ప్రజా చైతన్యమే లక్ష్యంగా ఈయన సేవలు చేస్తున్నారు.

అందరూ బాగుండాలనే..

-హన్మండ్ల రాజిరెడ్డి, బాలాజీనగర్ సంక్షేమ సంఘం

కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియం ఎదుట ఉన్న బాలాజీనగర్ కాలనీవాసులు మొదట్లో వైవిధ్య వినాయక ప్రతిమలను పెట్టేందుకు ఉత్సాహం చూపించేవారు. క్రమంగా పర్యావరణ పరిరక్షణ కోసం సమాజంలో అందరు బాగుండాలని, మనం చేసే కార్యక్రమాలు ఏ జీవరాశికి నష్టం కల్గించవద్దనే సదుద్దేశంతో ఆరేళ్లుగా మట్టి వినాయకులనే ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. ఇంటింటా మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠాపన చేయాలనే తలంపుతో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. నాలుగేళ్లుగా అంబేడ్కర్ స్టేడియం ఎదుట, భగత్‌నగర్, తిరుమల్‌నగర్, గణేష్‌నగర్, హనుమాన్‌నగర్ కేంద్రంగా మట్టి వినాయకులను ఉచితంగా అందజేస్తున్నారు. లయన్స్ క్లబ్, ఇతర సంస్థలు ముందుకు వచ్చి, సహకరించటంతో వీరి విజయపరంపర కొనసాగుతోంది. చిన్న మట్టి గణపతులను వరంగల్ నుంచి తెప్పిస్తున్నారు. ఈ ఏడాది కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



దశాబ్ద కాలంగా చేస్తున్నాం

-రవీందర్, కొత్తయాస్వాడ

రవీందర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. మొదటి నుంచి పర్యావరణ ప్రేమికుడు కావడంతో ఇంటి వద్ద అనేక మొక్కలను పెంచటం, సంరక్షించడంతో పాటు, తాను పనిచేసే పాఠశాలలో సైతం మొక్కలు నాటి సంరక్షించేలా కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ఏటా వినాయక చవితి సమయంలో మట్టి విగ్రహాలను తయారు చేస్తారు. 2008లో ప్రారంభించిన ఈ మహాయజ్ఞం ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. చిన్నతనంలో తండ్రి వద్ద మట్టి వినాయకుల తయారీతో పాటు, సహజ రంగులు ఎలా తయారుచేసుకోవాలో నేర్చుకొని, చిన్నతనం నుంచి మట్టి వినాయకున్ని తయారుచేసి ఇంట్లో ప్రతిష్ఠించుకొనేవారు. ఉద్యోగంలో చేరిన తర్వాత కరీంనగర్‌లో ప్రజాచైతన్యం కోసం మొదట్లో చెరువులోని నల్లమట్టిని తీసుకొని వచ్చి స్వయంగా విగ్రహాలను తయారుచేసి కాలనీవాసులకు ఉచితంగా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం పనిచేస్తున్న గంగాధర మండలం కాసారం గ్రామ పాఠశాలలో కూడా పిల్లలతో మట్టి గణపతులను తయారుచేయించి అందరికీ అందజేస్తున్నారు. స్వర్ణభారతి సంస్థ, అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజా అవగాహన కోసం రెండేళ్ల 'ఈనాడు' చేపట్టిన మట్టి గణపతిల తయారీ మాస్టర్‌గా కూడా పనిచేశారు.



పుష్కర కాలంగా చిన్నారులతో..!

- భగవతి పాఠశాల విద్యార్థులు



మట్టి వినాయకుల వినియోగ దిశగా మొదట ప్రోత్సహించింది భగవతి పాఠశాలనే.. ఆ పాఠశాల కరస్పాండెంటు బి.రమణారావు, విజయలక్ష్మీ ప్రయోగాత్మకంగా పన్నెండేళ్ల క్రితం నల్లమట్టితో మట్టి వినాయకులను తయారుచేయాలని ప్రయోగ పని కింద విద్యార్థులకు ఇచ్చారు. ఆరంభంలో కొంత తడబడినా రెండేళ్లకే పెద్ద మట్టి విగ్రహంతో పాటు, వందలాది చిన్న చిన్న మట్టి విగ్రహాలు తయారుచేసే స్థాయికి ఎదిగారు. ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిరాటకంగా కొనసాగుతోంది. ప్రస్తుతం పాఠశాలలో కనీసం వంద మందికి పైగా మట్టి విగ్రహాలు తయారుచేసే స్థాయికి ఎదిగారు. వినాయక చవితికి ముందు వీటిని తయారుచేయించటంతో పాటు, విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. ఏటా పాఠశాలలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఒక పెద్ద మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.



మట్టి విగ్రహాలను తయారుచేస్తున్న భగవతి పాఠశాల విద్యార్థులు

స్వర్ణభారతి ఆధ్వర్యంలో..!

మట్టి విగ్రహాల అవశ్యకతను వివరించేందుకు స్వర్ణభారతి సంస్థ 2007 శ్రీకారం చుట్టింది. పర్యావరణ, వాతావరణ కాలుష్యం నివారించే దిశగా ప్రతి ఏడాది లయన్స్ క్లబ్, రోటరీ, సీనియర్ సిటిజన్ లాంటి సంస్థలు ఈ సంస్థతో భాగస్వామ్యం అయి పలు చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా భావితరాలకు మట్టి విగ్రహాల వినియోగం, అవశ్యకతను తెలియజేసేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పీవోపీ నష్టాలను వివరించి, వాటి వల్ల కలిగే పర్యావరణ కాలుష్యాలను పిల్లలకు వివరిస్తారు. ఒక శిక్షకుడితో బాలబాలికలకు మట్టి ప్రతిమల శిక్షణను ఇప్పిస్తున్నారు.



కరపత్ర ప్రచారం

- వైరాగ్యం ప్రభాకర్, ఉపాధ్యాయుడు

కరీంనగర్ మండలం చామన్‌పల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా వైరాగ్యం ప్రభాకర్ పనిచేస్తున్నారు. కవిగా, ఉపాధ్యాయుడిగా పనిచేయటంతో పాటు పర్యావరణ, సమాజహిత కార్యక్రమాలకు ఎక్కువగా ఉత్సాహం చూపిస్తారు. దాంతో ఈ సంవత్సరం అందరూ మట్టి వినాయకులను వినియోగించాలని కోరుతూ కరపత్రం తీసుకొచ్చారు. గ్రామాలలో, నగరంలో ఎవరిని కలిసిన ఈ పత్రాలు అందజేస్తారు.

ఏటా మట్టి ప్రతిమల పంపిణీ

-ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ యువజన విభాగం

కరీంనగర్ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మూడేళ్లుగా మట్టి వినాయకులను తెప్పించి వివిద కాలనీల్లో పంపిణీ చేస్తున్నారు. వీరితో పాటు ఆర్యవైశ్య సంఘం కూడా ఇటువంటి కార్యక్రమాలను చేపడుతోంది. పలు కాలనీల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు.



రైతులకు కారాగారం... కేసీఆర్‌కు పురస్కారం

సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కేంద్ర వ్యవసాయ నాయకత్వ పురస్కారం ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తుందని సీఎల్పీ ఉపనేత, ఎమ్మెల్యే టి.జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పండిన పంటలకు గిట్టుబాటు కావాలని కోరిన రైతులకు బేడీలు వేసి జైలుకు పంపినందుకు పురస్కారం వచ్చిందంటే కేంద్ర వ్యవసాయ విధానం అర్థం చేసుకోవచ్చన్నారు. క్వింటాలు వరి ధాన్యానికి కనీసం రూ. 3వేలు ఉండాలని మిర్చి, పప్పు దినుసులకు కనీసం రూ.10వేల మద్దతు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చినా కేంద్రం పట్టించుకోకపోగా చుట్టుపక్కల రాష్ట్రాలు గిట్టుబాటు లేని విషయాన్ని దృష్టిలో ఉంచుకొని బోనస్ చెల్లించి ఆదుకోగా రైతులు నష్టపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం నయాపైసా ఇవ్వలేదన్నారు. వచ్చే సంవత్సరం నుంచి ఎకరానికి రూ.8వేలు ఇస్తామనడం సంతోషమే అయినప్పటికీ ప్రస్తుతం గిట్టుబాటు లేక నష్టపోయిన దానికి కారకులెవరని ప్రశ్నించారు. పసుపు రైతు ఎకరానికి రూ.15వేలు నష్టపోయారని జరిగే నష్టం ముందు ప్రభుత్వ సాయం పెద్దదేమీకాదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలైనా 30 శాతం రుణ ప్రణాళిక నెరవేరలేదని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరగాల్సి ఉన్నా సీఎం హాజరకాలేదని జిల్లాస్థాయిల్లోనూ సమావేశాలు జరగడం లేదన్నారు. రైతులకు రుణాలు లభించక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని వెంటనే ప్రగతి భవన్‌లో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసి నెలాఖరులోగా రుణ ప్రణాళిక లక్ష్యం నెరవేర్చే విధంగా చూడాలన్నారు. పంటల బీమాతో రైతుల కంటే కంపెనీలకు ప్రయోజనం ఎక్కువగా ఉందని ఒక్క రైతుకు కూడా పరిహారం అందడం లేదని కేంద్రం పురస్కారం ఇచ్చినందుకైనా రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపాలని జీవన్‌రెడ్డి అన్నారు. పురపాలక ఛైర్‌పర్సన్ టి.విజయలక్ష్మి, మాజీ ఛైర్మన్ గిరి నాగభూషణం, పురపాలక, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు సిరాజొద్దీన్ మన్సూర్, గంగం మహేష్, పురపాలక కౌన్సిలర్లు పుప్పాల అశోక్, కోర్టు శ్రీను, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బండ శంకర్, యువజన విద్యార్థి విభాగ బాధ్యులు రఘువీర్ గౌడ్, ముఖేష్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



TENTH English

ప్రతిభ

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company he keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)

2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.

2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.

2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of

2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from

3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with

4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to
c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in

Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without

Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందు కంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం **(R):** పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ **ఆగస్టు 14**

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ చోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహూరు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహూరు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.


ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపూర్ణం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

సిద్ధిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్ధిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్‌ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

● Produce = ఉత్పత్తిచేయు


● మధుకరం = తుమ్మెద

సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే	5. Pay	వే
2. Flute	వే	6. God	వే
3. Speed	వే	7. Function	వే
4. Heat	వే	8. Dawn	వే

- డీ దయామతి, హన్మకొండ



దారేది?

చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.

చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందిం చేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రామూ! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.


మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇది గోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.

'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలిసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.



మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a చిలిపిప్రశ్న: తినలేం కాబట్టి! సరదా పదాలు: 1. వేసవి 2. వేణువు 3. వేగము 4. వేడిమి 5. వేతనం 6. వేలుపు 7. వేడుక 8. వేకువ

అన్ని వర్గాలకు సమన్యాయంతోనే బంగారు తెలంగాణ

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే : విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ రంగాల్లో ఓసీల్లోని పేదలకు న్యాయం చేయాలని తెలుగు రాష్ట్రాల ఓసీ సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలాడి రామారావు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ఆదివారం కరీంనగర్‌లో లేఖ ప్రతులను పాత్రికేయులకు అందజేసి మాట్లాడారు. అగ్రవర్ణాల్లో అనేక మంది పేదలు ఉన్నారని, తినడానికి తిండికి లేక, ఉద్యోగాలు రాక, విద్యా సంస్థల్లో సీట్లు దొరక్క, విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమ ఫలాలు అందక దుర్భర జీవనం సాగిస్తున్నారని అందులో పేర్కొన్నారు. వ్యవసాయం అనుకూలించక అడ్డామీద కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని సామాజిక వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినపుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని లేఖలో పేర్కొన్నారు. రూ.3 వేల కోట్లతో ఓసీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో పాటు 80 శాతం రాయితీతో రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఓసీలలోని పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఆర్థికస్థితిగతుల ఆధారంగా ప్రత్యేకంగా రిజర్వేషన్లు అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. అగ్రవర్ణాల స్థితిగతులను అధ్యయనం చేయడానికి చట్టబద్ధతతో కూడిన కమిషన్ ఏర్పాటు చేసి పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అన్నారు. విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు, స్టడీ సర్కిళ్ల ఏర్పాటు, ప్రభుత్వ గురుకుల, రెసిడెన్సియల్, మాడల్ పాఠశాలల్లో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని కోరారు. ప్రతిభావంతులైన ఓసీ విద్యార్థులకు విదేశాల్లో చదువుకై రూ.20 లక్షలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. ఉద్యోగులకు పదోన్నతుల్లో ప్రతిభ, సీనియారిటీ ప్రాతిపదికగా తీసుకోవాలని, కుల, మతాల ప్రాతిపదికన కాకుండా ఆర్థిక ప్రాతిపదికగా అన్ని వర్గాల పేదలకు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు వర్తింపజేయడానికి ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన రైతులకు ఐదు వేల పెన్షన్, సామాజిక అడవులు పెంపకం చేపట్టే రైతులకు రూ.15 వేలు చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఓసీలు పాల్గొన్నారని చెప్పారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్

01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్

01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యో రామా రిపీట్

03:30 హంగామా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 ఈ-జంక్షన్

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యో రామా రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)

★ డా.ఈటీవీ – (ఉ. 6:30, 11:00, మ. 3:30, సా. 7:30)

★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)

★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)

★ ఆయుష్ (ఉ. 9:30)

★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)

★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)

★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)

★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)

★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)

★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్. వి. ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అప్సక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆప్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఫ్రీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా ఛెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & ఛాక్లెట్ ఆల్మండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC (TTD) — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV — **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

GEMINI — **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: రాజాబాబు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO — **ఉదయం:** 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

పుదీనా సాగు వివరాలు

పుదీనా సాగు గురించి కంపసాగర్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త హారిక సూచించారు. పుదీనా ఔషధ మొక్క. దీని ఆకులను ఎక్కువగా వంటలలో సువాసన కోసం సుగంధ ద్రవ్యం గాను వివిధ రకాల పచ్చళ్ల తయారి లోను, సలాడ్‌ల లోను వాడతారు. ఈ మొక్క 40 సె.మీ. ఎత్తు వరకు పెరుగుతుంది. ఆకులు గుండ్రంగా ఆకుల పైభాగం మందంగా ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. ఇందులో మెంథాల్ అనే సుగంధ నూనే చాలా తక్కువ పరిమాణంలో ఉంటుంది. కానీ కార్వోన్ అనే సుగంధ పదార్థం ఎక్కువగా ఉండి సువాసనను, ప్రత్యేకమైన రుచిని కలిగిస్తుంది. పుదీనా ఆకుల కాండం నుండి తీసే నూనెను మెంథాల్ అంటారు. మెంథాల్‌ను ఎక్కువగా ఔషధాల తయారిలో, షేవింగ్, టూత్‌పేస్ట్ తయారిలోను వాడుతుంటారు. మెంథాల్ నూనె శాతం ఆకుల్లో 0.3.నుండి 0.8 వరకు, కాండంలో 0.1 శాతం వరకు ఉంటుంది. అయితే ఈ మెంథాల్ నూనె కోసం సాగు చేసే పుదీనా జాతులు ప్రధానంగా నాలుగు రకాలుంటాయి.



★ జపనీస్ మెంట్, పిప్పర్ మెంట్, స్పేయర్ మెంట్, బెర్గా మెంట్. వీటిలో గుర్తింపు పొందిన శివాలిక్, హిమాలయ, కోసి, సిక్టమ్ రకాలు మాత్రమే నూనె కోసం సాగు చేస్తారు.

వాతావరణం: ఆకుకూరగా సాగుకు సమశీతోష్ణ, ఉష్ణ ప్రాంతాలు అనువైనవి. ఉష్ణోగ్రత 20-25 డిగ్రీలు ఉంటే ఆకు పెరుగుదల ఉంటుంది. నూనె కోసం అయితే ఎత్తైన చల్లని ప్రాంతాలు సాగుకు అనుకూలం.

నేలలు: సారవంతమైన అధిక సేంద్రియ పదార్థాలు గల తేలికపాటి ఇసుక నేలలు, మురుగునీరు పోయే వసతి గల తేలికపాటి ఒండ్రు నేలలు అనుకూలం నీరు నిలిచే నల్లరేగడి నేలలు పనికిరావు.

విత్తనం: పుదీనాను కాండం ముక్కలు నాటుకోవడం ద్వారా సాగు చేయవచ్చు. 2-3 కణుపులు కలిగిన ముక్కలు ఎన్నుకోవాలి. ఎకరాకు 3-4 క్వింటాళ్ల తీగ ముక్కలు అవసరం అవుతాయి.

విత్తనశుద్ధి: కాండం ముక్కలను లీటర్ నీటికి కార్బండిజమ్ 1 గ్రా. లేదా కాప్టాన్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. కలిపిన ద్రావణంలో పది నిమిషాలు ముంచి నాటుకోవడం వల్ల వేరుకుళ్లను అరికట్టవచ్చు.

నాటే విధానం: వరుసల మధ్య 30 లేదా 45 సె.మీ. వరుసల్లో మొక్కల మధ్య 10 సెం.మీ. ఎడంతో 1-2 సెం.మీ. లోతులో ఒక కణుపు తప్పనిసరిగా భూమిలో ఉండేలా నాటాలి.

నాటే సమయం: ఆకుకూర కోసం సంవత్సరం పొడవునా నాటుకోవచ్చు. నూనె కోసం సాగు చేస్తే నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపు నాటుకోవాలి. లేదా నూనె దిగుబడి తగ్గుతుంది.

ఎరువులు: ఆఖరి దుక్కిలో 5 టన్నుల పశువుల ఎరువు, 50 కిలోల నత్రజని, 85 కిలోల భాస్వరం, 15 కిలోల పొటాష్ వేయాలి. నత్రజని 3 దఫాలుగా అనగా ఆఖరి దుక్కిలో సగం, మిగతా సగం 40 రోజులకు, 80-90 రోజులకు వేసుకోవాలి.

–న్యూస్‌టుడే, త్రిపురారం.

పంటమార్పిడి-అంతరపంటలు

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయని, తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుందని కనుక పంటల మార్పిడి పాటించాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి శ్యాం సూచించారు. పురుగు జీవిత చక్రం ముగించుకొని హాని కల్గించే స్థితికి చేరుకుంటుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటను ఆశించడం తక్కువ. పంట మార్పిడి చేస్తే పురుగు జీవితచక్రం ఛేదింపపడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి.



కందిలో అంతరపంటగా పెసర

సాధారణంగా పాటించే పంటల సరళి అంతరపంటలు: పప్పుధాన్యపు పంట ఆహారపంట-పప్పుధాన్యపు పైరు, చిరుధాన్యాలు ఆహారపంట-చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి-పప్పుధాన్యపు పంట/వేరుశనగ/మొక్కజొన్న, పత్తి-జొన్న/మొక్కజొన్న, పొగాకు-మిరప/కూరగాయలు, చెరకు వరి/వేరుశనగ/కంది/ఆముదం/సజ్జ/జొన్న/

పంట మార్పిడి క్రమం: ఆహార వాణిజ్యపంటలు ఒకసారి, పప్పుజాతి పంటలు మరోసారి మార్పిడి చేయాలి. అవసరమైతే గడ్డిజాతి పైర్లు వేసుకోవాలి. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేయాలి. పప్పుజాతి పంటల వేర్ల బుడిపెల్లో రైజోబియం సూక్ష్మజీవులు గాలి లోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

–న్యూస్‌టుడే, ఖానాపురం.

మోడు.. ఆశల రేడు



చిత్రంలో కనిపిస్తున్న చెట్టు నిజంగా చిత్రంగానే ఉంది. చెట్టంతా ఎండి పోయినా ఇరు వైపులా కొమ్మలు అప్పుడో ఇప్పుడో పడిపోయేలా ఉన్నాయి. దూరం నుంచి చూస్తే మోడు వారిన చెట్టుగా కనిపిస్తోంది.. నగరంలోని ఒకటో టౌన్ ఎదురుగా ఉన్న పురాతన ఈద్గాలోని ఆ చెట్టును సమీపించగానే రెండు వైపులా ఎండిన కొమ్మలు ఉండగా మధ్యలో మాత్రం పచ్చ దనం చిగురిస్తోంది. చూపరు లను ఆకట్టుకుంటోంది.

-న్యూస్‌టుడే, గణేశ్‌నగర్ (కరీంనగర్)

బస్సులున్నా.. బాధలే!



బస్సుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు



ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

జిల్లా కేంద్రంలో 18 నగర బస్సులు ఉన్నా విద్యార్థులు కళాశాల సమయానికి బస్సులు నడపకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్ర సమీపంలోని తిమ్మాపూర్, రామకృష్ణ కాలనీ వద్ద పలు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. సాయంత్రం 5 గంటలకు వందలాది మంది విద్యార్థులు ఒకేసారి జిల్లా కేంద్రానికి చేరుకోవడానికి రహదారి మీదికి వస్తున్నారు. ఆ సమయంలో బస్సులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయానుగుణంగా బస్సులు నడిపించాలని విద్యార్థులు కోరుకుంటున్నారు.

-న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

బంగారు తెలంగాణలో భాగస్వాములు కావాలి



స్పీకర్ మధుసూదనాచారిని సన్మానిస్తున్న దృశ్యం

తెలంగాణచౌక్, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(వోపా) ఆధ్వర్యంలో కళాభారతిలో నిర్వహించిన 61వ వధూవరుల పరిచయ వేదిక, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బంగారు తెలంగాణలో విశ్వబ్రాహ్మణులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న విశ్వబ్రాహ్మణులు అడుగడుగునా అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వారి సంక్షేమానికి రూ. 200 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఐక్యంగా ఉంటూ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని, రాజ్యాధికారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముగ్దుంపూర్‌లోని వసతి గృహ నిర్మాణానికి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ పథకాలు రూపొందిస్తోందన్నారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ, విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. వోపా అధ్యక్షుడు వేములవాడ ద్రోణాచారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, ఏకానందం, సత్యనారాయణ, శ్రీనివాస్, తేజ, కె.సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలం.. పండ్ల మొక్కలు సిద్ధం

ఉద్యాన శాఖ నర్సరీల్లో 10.44 లక్షల మొక్కలు

న్యూస్‌టుడే, కలెక్టరేట్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వాతావరణం చల్లబడింది.. నేలలో తేమ సరిపడా ఉండగా మొక్కలు నాటేందుకు అనుకూల సమయం. ఈ సమయంలో మొక్కలు నాటితే త్వరగా నాటుకుని ఏపుగా పెరిగే అవకాశముండగా పండ్ల మొక్కలు నాటేలా ప్రోతహిస్తోంది ఉద్యాన శాఖ.. రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆదేశాల క్రమంలో జిల్లాలో పండ్ల మొక్కలను వృద్ధి చేయాలని జిల్లా పాలనాధికారి సర్ఫరాజ్ అహ్మద్ నిర్దేశించారు.. ఈ నేపథ్యంలో ఉద్యాన శాఖ జిల్లా వ్యాప్తంగా 9 నర్సరీల్లో 10,44,000 పండ్లు, పూల మొక్కలను సిద్ధం చేసింది. వర్షాలు పడుతున్నందున నివాసాల్లో మొక్కలను నాటుకోవాల్సిన అవసరముంది. తరుణం దాటితే మొక్క నాటుకోవాలంటే కష్టం. మార్కెట్‌లో పండ్లను కొనుగోలు చేయాలంటే కార్బయిడ్ భూతం వెంటాడుతోంది. ప్రాణానికి ప్రతికూలంగా మారుతుండగా మన స్థలాల్లో పండ్ల మొక్కలను నాటుకోవడం ఉత్తమం. వివిధ రకాల మొక్కలు సిద్ధం : జిల్లాలోని 9 నర్సరీల్లో వృద్ధి చేసిన పండ్లు, పూల మొక్కలు ప్రస్తుతం నాటుకునే దశకు చేరాయి. ఎప్పటికప్పుడు మొక్కల వృద్ధిపై సమీక్షించిన ఉద్యాన శాఖ ఉప సంచాలకులు బండారి శ్రీనివాస్ వాటి పంపిణీకి చర్యలు చేపట్టారు. నర్సరీల్లో మునగ, ఉసిరి, నిమ్మ, సీతాఫల్, దానిమ్మ, బొప్పాయి, గులాబీ, మల్లె, మందార, జామ, పారిజాతం, నందివర్ధనం వంటి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. కరీంనగర్ రూరల్ మండలం కమాన్‌పూర్, కొత్తపల్లి మండల కేంద్రం, వీణవంక మండలం వల్బాపూర్, హుజూరాబాద్ మండలం దమ్మక్కపేట, సైదాపూర్ మండలం బొమ్మకల్, చిగురుమామిడి మండల కేంద్రం, గంగాధర మండలం మంగపేట, రామడుగు మండలం గోపాల్‌రావుపేట, చొప్పదండి మండలం రాగంపేట గ్రామాల్లో నర్సరీలను నిర్వహిస్తున్నారు. రాగంపేట, మంగపేట, చిగురుమామిడి, దమ్మక్కపేట నర్సరీల్లో లక్ష మొక్కలను వృద్ధి చేయగా కమాన్‌పూర్, కొత్తపల్లి, వల్బాపూర్, బొమ్మకల్, గోపాల్‌రావుపేట నర్సరీల్లో 2లక్షల మొక్కలను పెంచారు.



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

రాజన్న చెంత భక్తుల రద్దీ

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారి దర్శనాల కోసం తెల్లవారుజామునుంచి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అర్జిత సేవలు రద్దు చేసి శీఘ్రదర్శనం కల్పించారు. గర్భగుడిలోకి ప్రవేశాలు నిలిపివేశారు. ధర్మగుండంలో స్నానాలనంతరం భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని సోమేశ్వర, అనంత పద్మనాభస్వామి, రామాలయం, బాలాత్రిపురాసుందరీ దేవి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కళాభవన్‌లో కల్యాణం, ప్రత్యేక సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.